# ఆత్మజ్ఞానం పొందలేక పోవడానికి కారణం?

రచన: బ్రహ్మావిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి గారు



# ఆత్మజ్ఞానం పొందలేక పోవడానికి కారణం?



రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

మొదటి ముద్రణ : డిశంబరు, 2025
ప్రతులు : 2,000

వెల : **రూ.70/-**

పుస్తకముల కొరకు :-
**తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94901 71853, 9440309812

# విషయ సూచిక

1. ఆత్మజ్ఞానం పొందలేక పోవడానికి కారణం? ........................ 3
2. ఆనంద స్థితి పొందాలంటే ? ........................................ 11
3. అజ్ఞానానికి మూలం ఏంటి? ........................................ 16
4. ఇంద్రియ నిగ్రహం ఎందుకు ఉండాలి? ................................ 22
5. మానవజన్మ పరమార్థం ................................................ 30
6. పూర్ణ జ్ఞానం పొందే వరకు భూమిమీదకి రావలసిందే .......... 36
7. ధర్మజ్ఞుడు అంటే ఎవరు? .............................................. 44
8. మనస్సు ఎందుకు ఇవ్వబడింది? ...................................... 51
9. సంకల్పం శక్తివంతంగా ఉంచుకోవాలంటే? ........................ 55
10. జ్ఞానం పొందాలంటే? .................................................. 60

## తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 11) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 12) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 13) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 14) పంచకోశాలు | - | రూ.60/- |
| 15) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 16) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 17) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : తటవర్తి వీర రాఘవరావు, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,

# ఆత్మజ్ఞానం పొందలేక పోవడానికి కారణం?

మనమంతా ఎన్నో సంవత్సరాల నుంచి సాధన చేస్తూ జ్ఞానాన్ని పెంచుకుంటున్నాం. మన పరలోక ప్రయాణానికి, పరమాత్మ దర్శనానికి ఈ ఆత్మజ్ఞానము, బ్రహ్మజ్ఞానమే మెట్లు.

మరి ఈ ఆత్మజ్ఞానము భూమిమీద ఉండగా నేర్చుకోకపోతే పరలోక జీవితం గొప్పగా ఉండదు. భూమిమీద మానవ జన్మ తీసుకున్నాము అంటే మరుజన్మ లేకుండా చేసుకోవడానికే అని సాధకుడు తెలుసుకోవాలి.

ప్రతి జన్మలో కూడా ఎంజాయ్ చేయడానికి, అనుభవించడానికి పుట్టాము అని అజ్ఞానులు అనుకుంటారు. కానీ జ్ఞానులు భగవంతుని తెలుసుకుని జన్మలేని స్థితికి వెళ్ళాలి అని తెలుసుకుంటారు.

ప్రాపంచిక విద్యని అపరావిద్య అంటారు, ఆధ్యాత్మిక విద్యని పరావిద్య అంటారు. ఇప్పుడు భూమిమీద అందరూ అపరా విద్యకే విలువ ఇస్తున్నారు. కానీ పరావిద్య నేర్చుకోవడానికి అపరావిద్య సహాయకారే కానీ గొప్పది కాదు. మరి పరావిద్య ఎంతో కష్టపడితే కానీ నేర్చుకోలేరు.

ఎందుకంటే మానవుడికి మనసు అనేది ఇవ్వబడింది. అది ప్రపంచం వైపు తిరిగినప్పుడు అపరావిద్య నేర్చుకుంటాడు. భగవంతుడు గురించి తెలుసుకోవాలి అనుకున్నప్పుడు మొట్టమొదటగా గురువు ద్వారా బాహ్యంలో కాదు అంతరంలో వెతకాలని తెలుసుకుంటాడు. ధ్యానం వల్ల మాత్రమే నీలో అంతర్గత శక్తి బయటకి వస్తుందని గురువులు బోధిస్తారు.

ఆహారం ద్వారా వచ్చే శక్తితో అన్నమయ కోసం, మనోమయ కోసం పనిచేస్తాయి. కానీ ఇంకా చాలా శక్తులు లోపలి నుంచి రావాలి. మరి మిగతా శరీరాలకి ధ్యానం ద్వారా పొందే విశ్వశక్తి ఒకటే ఆహారము అని చెప్పడం జరిగింది.

ఆత్మజ్ఞానము పొందలేకపోవడానికి  కారణాలు.

1) మానసికమైన జడత్వము.

2) సంశయ చిత్తం.

3) అసంతృప్తి.

4) మనసు అశాంతిలో ఉండడం.

5) విద్యాకాంక్ష లేకపోవడం.

ఇప్పుడు వీటిని వివరించు కుందాం.

**1) మానసికమైన జడత్వము:-**

అంటే ప్రపంచం వైపు తిరిగి ఉన్న మనసు పరమాత్మ గురించి తెలుసుకోవడానికి  ముందు ఇష్టపడదు. ప్రాపంచిక వ్యవహారాల్లో అంటే ఉద్యోగాల్లో కానీ, వ్యాపారాల్లో కానీ, పదవుల్లో కానీ, బాగా మునిగి వుంటారు. వాళ్ళకి ధ్యానం అన్నా, ఆత్మవిద్య, బ్రహ్మ విద్య అన్నా ఆసక్తి చూపించరు. దీన్నే మానసికమైన జడత్వము అన్నారు. అంటే మనసును జ్ఞానం మీద పెట్టడానికి ఇష్టపడరు. ఆ భగవంతుడు కోరికలు తీర్చేవాడని మాత్రమే వారికి తెలుసు, వారు అంతవరకే  ఆలోచిస్తారు.

ఎందుకంటే వారు ప్రపంచంలో ఉన్నవన్నీ గొప్పవి అనుకుంటూ, వాటి కోసమే పాటుపడుతూ, అదే జీవితం అనుకుంటూ బ్రతుకుతారు. అందుకే వశిష్టుల వారు రూప మదము, విద్యా మదము, ధన మదము ఉన్నవాడు ఆత్మవిద్య నేర్చుకోవడానికి ఇష్టపడడు అంటారు.

ఇదంతా సరైన ఆహారం కాకుండా రజోగుణం, తమోగుణం పెంచే ఆహారం తీసుకోవడం వల్ల ఏర్పడుతుంది. ఎందుకు అంటే  ఆహారం వల్లే మనసు కాబట్టి,  దానివల్లే ఈ ఆత్మవిద్య, బ్రహ్మ విద్య నేర్చుకోవడానికి ఇష్టపడరు.

అందుకే పత్రి గారు  ఆత్మజ్ఞానం చెపుతా మంటే ఎవరూ వినరు కాబట్టి, ధ్యానం చేస్తే ఆరోగ్యం, మానసిక ప్రశాంతత  కలుగుతాయని చెప్పారు.

ఈ జడత్వానికి కారణం  వాళ్ళు తినే ఆహారం, గత జన్మల

సంస్కారాలు. కాని పరమాత్మను చేరుకోవడానికి ఉన్న ఒకే ఒక్క మార్గం ధ్యానం అని అర్థం చేసుకోవాలి.

శంకరాచార్యులవారు కూడా మానవుడు దుఃఖంలో ఉండడానికి కారణం ప్రాపంచిక కోరికలే అన్నారు. కానీ ఆత్మ శక్తిని పెంచుకుంటూ సాధన వైపుకి వచ్చి కూడా జ్ఞానాన్ని పొందలేకపోతున్నాడు అని ఆయన ఎన్నో సందర్భాల్లో చెప్పడం జరిగింది. కనుక మానవుడు మనసుకున్న జఢత్వం వల్లే బ్రహ్మవిద్యను పొందలేడు అని చెప్పడం జరిగింది.

**2) సంశయ చిత్తం:-**

అంటే కనబడని భగవంతుడు ఉన్నాడో, లేదో! తెలియని భగవంతుని గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఏముంది? ధనం సంపాదించుకుంటే దర్జాగా బ్రతకవచ్చు కదా! అనుకుంటారు. ఇదే ఆ మనసుకున్న సంశయం.

అంటే వాళ్ళు కనిపించే ప్రపంచం సత్యమని నమ్ముతున్నారు, కనిపించని దానిగురించి వారికి తెలియదు. అంతేకాదు కనిపించే ప్రపంచానికి కనిపించని భగవంతుడే ఆధారం అనే విషయం కూడా తెలియదు. అసలు సృష్టిలో ఈ జీవులు అన్నీ హాయిగా బ్రతుకుతున్నాయంటే? కారణం ఆ జీవులలో భగవంతుడు అంతర్యామిగా, ఆత్మగా ఉన్నాడు కాబట్టే అనే చిన్న సత్యం తెలుసుకోలేక పోవడం వల్ల.

కొంతమంది భగవంతుడు ఉన్నాడు అంటేనే నమ్మలేని హీన స్థితిలో కూడా ఉన్నారు. మరి నువ్వు భూమిమీదకి ఎలా వచ్చావు? అమ్మ కడుపులోంచి ఎలా పుట్టావు? అంటే. ఇవన్నీ సైన్స్ పరంగా నిరూపిస్తే నమ్ముతాను అంటారు.

మరి ఈ విధంగా భగవంతుడు లేడని కొందరు, ఉంటే నాకు చూపించు అని అడిగే వాళ్ళు కొందరు, సంశయాలతో ఉంటారు. మరి ఇలాంటి సంశయ చిత్తులకి బ్రహ్మజ్ఞానం నేర్చుకోవడానికి చాలా జన్మలు పడుతుంది. ఎప్పుడైతే సద్గురువు వస్తాడో అప్పుడు తెలుస్తుంది. ఈ కనిపించే సృష్టికి కనిపించని పరమాత్మ ఆధారం అని తెలుస్తుంది.

కొంచెం బుద్ధిని ఉపయోగించినా తెలుస్తుంది. గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ తిరుగుతున్నాయి. మరి వాటిని అలా బ్యాలెన్స్ గా ఉంచుతూ, అవి పడిపోకుండా, ఒకదాన్ని ఒకటి ఢీ కొట్టకుండా కాపాడుతున్నది ఏ శక్తి? ఆలోచించండి? గురువు చెప్పేస్తాడు కానీ అది లోతుల్లోకి అధ్యయనం చేయకపోతే ఆ జ్ఞానం అర్థం కాదు.

గురువు ఈ కనిపించే సృష్టికి కనిపించని పరమాత్మే ఆధారం అని చెప్పినప్పుడు సంశయం లేకుండా విచారణ చేసి, భగవంతుడు ఉన్నాడు అనే స్థిర చిత్తంతో ఉంటే బ్రహ్మజ్ఞానం పొందడానికి నువ్వు అర్హత సంపాదించినట్లే.

**3) అసంతృప్తి:-**

అంటే ప్రాపంచిక జీవితంలో తృప్తిగా జీవించకపోవడం. ఇప్పుడు ప్రతి వాళ్ళు అసంతృప్తితోటే జీవిస్తున్నారు. ఎన్ని ఉన్నా ఇంకా సరిపోదు అనుకుంటూ ఆయుష్షు తరిగిపోతున్నా, ఇంద్రియాలు పని చేయని స్థితికి చేరుకున్నా ఇంకా ఏదో సంపాదించాలని ప్రయత్నిస్తున్నారు.

గమనించండి చాలామంది రిటైర్మెంట్ తీసుకున్నాక కూడా ఇంకా ఆరోగ్యంగా ఉన్నానుగా అని మళ్ళీ టెంపరరీ జాబ్ కోసం ట్రై చేస్తారు కానీ భగవంతుని తెలుసుకోవాలని ప్రయత్నించరు. కనీసం అప్పుడైనా భగవంతుడి చింతలో ఉందాము, జ్ఞానం పెంచుకుందాము సాధన చేద్దాము అని ఉండదు.

అప్పుడైనా తృప్తిగా ఉంటాడా అంటే! ఉండదు. మంచం మీద పడ్డాక అయ్యో నాకు ఇంద్రియాలు పని చేసినప్పుడు భగవంతుని గురించి ఆలోచించలేదే అనుకుంటాడు. కానీ అప్పుడు ఏ ప్రయోజనం లేదు, ఎంత పశ్చాత్తాప పడినా లాభం లేదు.

నువ్వు ఊపిరి తీసుకోగలుగుతున్నావంటే, దానికి కారణం భగవంతుడే అని అర్థం చేసుకుంటే భగవంతుడికి కృతజ్ఞత చెప్తావు.

ఎప్పుడైతే గురుకుల విద్యలు పోయాయో, ఎప్పుడైతే బ్రహ్మజ్ఞానమే మానవుడి యొక్క అంతిమ లక్ష్యము అనే ఆలోచన లేదో ఈ బ్రహ్మ విద్యని

పొందలేకపోతున్నారు.

**4) మనసు అశాంతిలో ఉండడం:-**

నాకున్న సమస్యలే నేను తీర్చుకోలేకపోతున్నాను ఇంక ధ్యానానికి ఎప్పుడు ఖాళీ అని చాలామంది అంటారు. కళ్ళు మూసుకుంటే అవే ఆలోచనలు వస్తున్నాయి అని చెప్తారు. ఇప్పుడు చూడండి ఎవరైనా సరే ఒక మాల వేసుకుంటే కష్టపడైనా 40 రోజులు వాళ్ళ పనులు ప్రక్కన పెట్టి మరీ ఆ దీక్ష పూర్తి చేస్తారు. అలాగే నీ దుఃఖాన్ని పోగొట్టే మార్గం ధ్యానసాధన అని గురువులు, మహాత్ములు చెప్తున్నప్పుడు ఒక్క 40 రోజులు దీక్షగా సాధన చేస్తే దాని రుచి ఏమిటో తెలుస్తుంది.

కానీ మానసికమైన అలజడుల వల్ల బ్రహ్మజ్ఞానం పొందడానికి ఇష్టపడరు. ఇంకా కొంతమంది ధ్యానం లోకి వచ్చాక ఏవైనా కష్టాలు కానీ, పనుల్లో ఆటంకాలు కానీ వస్తే మాకు ధ్యానం అచ్చి రాలేదు అని ధ్యానం వదిలేస్తారు. అలా ఈ ప్రపంచంలో ఎన్నో సంవత్సరాల నుంచి ఈ ధ్యానం కనుమరుగయిపోయింది.

పూజలు, వ్రతాలు, తీర్థయాత్రలు భగవంతుడికి సంబంధించినవి అనుకుంటూ, వాటివల్ల పుణ్యం వస్తుంది అని వాటికే ప్రాముఖ్యం ఇస్తున్నారు. కానీ జ్ఞానం పొందితేనే మోక్షం వస్తుందనే సత్యాన్ని తెలుసుకోవట్లేదు. కానీ ఇది బాగా తెలుసుకున్నవాడు ఒక్క నిమిషం కూడా వృధా చేయడు.

యోగంలో ఎన్ని ఆటంకాలు వచ్చినా ఇది నీ కర్మ ఫలమే, కర్మ ఉంటే కష్టం వస్తుంది అని తెలుసుకోవాలి. గురువు చెప్పిన విషయాల్ని అధ్యయనం చేయ్యరు, విచారణ చెయ్యరు. అందుకే పత్రిగారు స్వాధ్యాయం చెయ్యాలి అనేవారు.

ఎందుకంటే నేను చెప్తాను మీరు వ్రాసుకుంటారు కానీ అవి ప్రక్కన పెట్టి మీ ఊహకు తగ్గట్టు చేస్తే లాభం లేదు. చెప్పిన ప్రతి విషయాన్ని మీరు పదే పదే అధ్యయనం చేసుకోగలిగితే విచారణ చేసుకుంటే లోపము అనేది

మీకు అర్థమవుతుంది.

ఇప్పుడు మీరు సాధనా మార్గంలోకి వచ్చారు.

పత్రిగారు చిన్న చిన్న పాపాలు, చిన్న చిన్న రోగాలు, పెద్ద పెద్ద పాపాలు పెద్ద పెద్ద రోగాలు పాపమే లేకపోతే రోగమే లేదు అని చెప్పారు.

అంటే కర్మ ఉంది కాబట్టే రోగం వచ్చింది అన్నది అర్థమవుతుంది. ఇప్పుడు నేను ధ్యానంలోకి వచ్చిన ఏడాదికి ఫైర్ యాక్సిడెంటు వల్ల కాలి పోయాను. కర్మ ఉంది కాబట్టే ఇది జరిగింది అని తెలుసుకున్నాను కాబట్టే ధ్యానం వదలలేదు.

అందుకే సత్యం తెలుసుకోవాలి. సత్యం అన్నది ఒకసారి విని వదిలేయడం కాదు. సత్యంలో జీవించడం అంటే నీ జీవితంలో ఏ సంఘటన జరుగుతున్నా ప్రతి క్షణము ఇది నా కర్మ వల్లే వచ్చింది అనే జ్ఞానం, ఆ ఎరుక నీలో ఉండాలి. భగవంతుడి గురించి నీకు అర్థమైనప్పుడు నా జీవితంలో కష్టాలు భగవంతుడు ఇవ్వలేదు ఇవి నా కర్మ ఫలాలే అని తెలుసుకుంటావు. అప్పుడే ఈ సాధనా మార్గంలో ఏ కష్టం వచ్చినా వెనక్కి అడుగువేయకుండా బ్రహ్మజ్ఞానం పొందేవరకు సాధనను చేస్తూ ఉంటావు.

**5) విద్యాకాంక్ష లేకపోవడం:-**

అంటే మామూలు ప్రాపంచిక విద్యలు చదవలేదు కదా? మరి ఆధ్యాత్మిక విద్య ఎలా వస్తుందని అనుకోవడం.

రత్నాకరుడు లాంటి వాడు వాల్మీకి అయినప్పుడు నేనెందుకు కాలేను? అన్న పట్టుదల ఉండాలి. ఇచ్ఛా శక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి ఈ మూడు శక్తులు నీలో ఉన్నాయి. ధ్యానం ద్వారా శక్తిని పెంచుకుంటే ఈ మూడు పెరుగుతాయి. నీకు నేర్చుకోవాలి అనే ఇచ్ఛ ఉంటే సాధన చేయాలి, సాధన చేస్తే జ్ఞానం పొందుతావు.

ఏ చదువు రాని రమణ భగవానుడికి సాధన వల్ల ఇంగ్లీష్ మాట్లాడటం కూడా వచ్చింది. ఏది అవసరమో అది ఆ విశ్వం, ఆ ప్రకృతి నీకు ఇస్తుంది.

అందుకే నాకు చదువు లేదు అని అనుకోకుండా  ధ్యానం చేస్తే అన్నీ సాధించవచ్చు.

ఆత్మవిద్య నేర్చుకోవడానికి ఏ డిగ్రీలూ అవసరం లేదు, ఏ సంపదలూ అవసరం లేదు. మానవ దేహం ఉండి సాధన చేస్తే చాలు తప్పకుండా బ్రహ్మ విద్య అబ్బుతుంది.

ఎంతో మంది ఋషుల్ని, ఈ బ్రహ్మ విద్యను పొందిన వారిని పరిశీలిస్తే మనమంతా వాళ్ళకంటే ఇంకా చాలా మంచి జన్మ తీసుకున్నాం అని అర్థమవుతుంది. అందుచేత నాకు రాదు, నాకు తెలియదు, నేను చెయ్యలేను అనకుండా ప్రయత్నిస్తే ఎందుకు సాధించలేరు? కానీ ఇచ్చిన శరీరాన్ని ఉపయోగించకపోతే భగవంతుడి దృష్టిలో మీరు దొంగలే.

సాధనకి అనుకూలమైన ఈ మానవ దేహం తీసుకుని, సాధన చేస్తాను అని ఒప్పుకుని వచ్చి మర్చిపోతున్నారు. ప్రాపంచిక భోగాల్లో పడి మాయకు వశమై, ఇది నాకు దక్కలేదే అని దుఃఖంలో కూరుకుపోతున్నారు .

కానీ మనల్ని ఆ భగవంతుడు వదలడు. మనం మరిచిపోయినా మనకి జ్ఞాపకం చేయడానికి జీవితంలోకి ఒక సద్గురువుని పంపుతాడు. భగవంతుడికి మన మీద ఎంత కరుణో ఆలోచించండి. మరి అలా పంపినప్పుడు కూడా అందుకోకపోతే మనకంటే దౌర్భాగ్యులు భూమిమీద ఉండరు.

అందుకే మనకి విద్య ఉన్నా లేకపోయినా, ధనం ఉన్నా లేకపోయినా, పదవులు ఉన్నా లేకపోయినా, ఆత్మ విద్య పొందడానికి మనకి అర్హత ఉంది. మిగతా  వాటితో పని లేదు.

మీకు విద్యాకాంక్ష లేకపోయినా భగవంతుడి మీద ప్రేమ ఉండాలి, భక్తి ఉండాలి, శ్రద్ధ ఉండాలి. ఈ మూడు భగవంతుని చేరుకోవడానికి అర్హతలు.

ఎందుకు భక్తి ఉండాలి అంటే! భగవంతుడు ఈ శరీరం ఇచ్చి వదిలేయలేదు, ఈ శరీరం హాయిగా జీవించడానికి మనకి ఎన్నో వనరుల్ని ఇచ్చాడు. అలాంటి భగవంతుడి మీద  భక్తి ఉండాలి.

సద్గురువు వచ్చి భగవంతుడు మనకు ఎన్ని ఉపకారాలు చేశాడో చెప్పినప్పుడు, ఆయన్ని చేరుకునే మార్గం ఇది అన్నప్పుడు, శ్రద్ధతో సాధన చేయగలిగితే భగవంతుడి మీద భక్తి, శ్రద్ధ రెండు ఉన్నట్టే. అవి ఉంటే మనకి ప్రాపంచికంలో ఏమి ఉన్నా లేకపోయినా సంబంధమే లేదు.

సాధన చేయడానికి మానవ శరీరం ఒక్కటే అర్హత అని తెలుసుకున్నారు కాబట్టి ఇప్పుడు మొదలు పెడితే తప్పనిసరిగా గమ్యాన్ని చేరుకోవచ్చు, అంటే బ్రహ్మ విద్యను పొందవచ్చు. సంపదలు, భోగాలు, సంతానం, బంధాలు అన్నీ భూమిమీద వదిలేవే.

ఇవన్నీ తెలుసుకున్నాక వర్తమాన జీవితంలో తృప్తిగా బ్రతుకుతూ, భవిష్యత్తులో ఎలా ఎదగాలో నేర్చుకుంటూ, ఆత్మ కూడా పట్టికెళ్లే వాటి గురించి ప్రయత్నిస్తూ, సాధన మీద శ్రద్ధ పెట్టి, భక్తి చూపించినప్పుడు ఈ జన్మలోనే బ్రహ్మజ్ఞానం పొందే అర్హత మీకు తప్పకుండా వస్తుంది.

అందుకే సద్గురువు వచ్చి సాధన చెప్పాక నువ్వు సాధన చేసి ధ్యానం మీద తీవ్రాతి తీవ్రమైన కాంక్ష పెంచుకుంటే బ్రహ్మ విద్య పొందవచ్చు.


## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

# ఆనంద స్థితి పొందాలంటే ?

అందరూ శాంతిగా జీవించాలని  కోరుకుంటారు. అందరికీ కోరిక అయితే ఉంది కానీ అది పొందాలి అంటే ఈ ఆధ్యాత్మిక మార్గంలోనే పయనించాలి.

మీరు  ఎందుకు శాంతిగా ఉండలేకపోతున్నారు అనేది కొంచెం వివరంగా తెలుసుకుంటే లోపం అన్నది మీ ప్రయత్నంలోనే ఉంది అని తెలుస్తుంది. మీ మనసు కలుషితంగా ఉన్నన్నాళ్ళు ఎంత సాధన చేసినా, ఎంత స్వాధ్యాయం చేసినా శాంతి అనేది దొరకదు.

మనసుని ఎప్పుడూ శాంతిగా ప్రశాంతంగా ఉంచుకోగలగాలి. ప్రశాంతమైన మనసు ఉంటేనే పరమాత్మ దగ్గర స్థానం అని మహాత్ములు చెప్తూ ఉంటారు. ఎవరైతే  ఈ సృష్టిలో అన్నీ ఆయనే ఇస్తున్నాడు, అంతటా ఆయనే ఉన్నాడు అనేది తెలుసుకుని భగవంతుడి మీద అనన్యమైన భక్తి కలిగి ఉంటారో వారు తమ జీవితం గురించి, ప్రక్కవాడి జీవితం గురించి ఎప్పుడూ ఆలోచించరు. మీకు  ఏది జరగాలో అదే జరుగుతుంది అని ఎప్పుడూ నిశ్చింతగా ఉంటారు.

ఎప్పుడైతే నిశ్చింతగా ఉంటారో అప్పుడు మీ మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చాక ఈ విషయాలు కొన్ని తెలుసు కుంటారు. కానీ పూర్తిగా తెలుసుకోవాలి అంటే  సాధన ఖచ్చితంగా చేయాల్సిందే.

మరి ఎవరైతే నిష్కామంగా కర్మలు చేస్తారో అంటే ఒక యజ్ఞం కానీ, దానం కానీ చేస్తారో వాళ్ళ మనసు ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటుంది. ఎందుకంటే ఫలితం పరమాత్మకి అర్పించాడు కాబట్టి వాళ్ళు ప్రశాంతంగా జీవిస్తారు.

అలాగే కోరరాని కోరికలు కోరకుండా, కోరికల్ని తగ్గించుకుంటూ ఉంటే అప్పుడు కూడా ప్రశాంతంగా ఉంటారు. ఇది మనకి ఎలా వస్తుంది అంటే ఇది నాకు అవసరమా? అవసరం లేదా? అని ఎప్పటికప్పుడు విచారణ

చేసుకుంటూ ఆత్మ మీద దృష్టి పెట్టినప్పుడు మనసు చాలా నిర్మలంగా, శాంతిగా ఉంటుంది.

శాంతి పొందాలంటే? లోపాలు సరిచేసుకుని తప్పులూ, పాపాలూ చేయకుండా ఉండడమే. ఎంతవరకు తప్పులూ, పాపాలూ చేస్తూ ఉంటారో అంతవరకు మీ మనసు అల్లకల్లోలంగా ఉంటుంది. ఎప్పుడైతే అవి ఆపుతారో మనసు చాలా ప్రశాంతంగా ఉంటుంది.

గత జన్మలలో సంస్కారాలను బట్టి మీలో రాగద్వేషాలు ఉంటూనే ఉంటాయి. మరి ఈ రాగద్వేషాలు ఎలా పోతాయి? అంటే వైరాగ్యం వల్ల పోతాయట. అంటే ఈ శరీరం శాశ్వతం కాదు, ప్రపంచము శాశ్వతం కాదు అనుకున్నప్పుడు పోతాయి. మరి శంకరాచార్యులు చెప్తారు జగత్ మిథ్య ఆత్మ సత్యం అని. నేను శరీరం తెచ్చుకున్నది నేనెవరో తెలుసుకోవడానికి మీరు వైరాగ్యంలో ఉండగలిగితే రాగద్వేషాలు పోయినట్టే.

వైరాగ్యం అంటే అన్నీ వదిలేసి పారిపోవడం కాదు. ఉన్నవి అనుభవించాలి, లేనివి కావాలని ఎప్పుడు కోరుకోకూడదు. ఇప్పుడు కోరిక వస్తే ఆ కోరిక తీర్చుకోవడానికి ప్రయత్నం చేస్తారు. మరి ఆ కోరిక తీరకపోతే వాళ్ళు కారణం, వీళ్ళు కారణం అనుకుంటూ ద్వేషాన్ని పెంచుకుంటారు. తీరినప్పుడు వాళ్ళ మీద అనురాగం పెరుగుతూ ఉంటుంది, లేకపోతే ద్వేషం పెరుగుతూ ఉంటుంది.

ఇప్పుడు చూడండి మీరు మీ భర్తను కానీ,  భార్యను కానీ, తల్లిదండ్రులను కానీ ఏదైనా ఒక కోరిక కోరినప్పుడు వాళ్ళు తీరిస్తే మా అమ్మ మంచిది, మా నాన్న మంచోడు, నా భర్త మంచోడు అని చెప్తారు. తీర్చకపోతే ఎప్పుడూ ఇంతే నేనడిగింది ఇవ్వరు అని ద్వేషం పెంచుకుంటారు. కానీ ఒక జ్ఞాని ఈ ప్రపంచమంతా అశాశ్వతం. ఇవేవీ కాదు నా సాధన బాగా ఉండాలి, నా జ్ఞానం బాగా పెరగాలి అని చూస్తాడు.

నిజానికి భగవంతుడి మీద మీకు భక్తి బాగా పెరిగే కొద్దీ, ప్రపంచం మీద వైరాగ్యం వస్తూ ఉంటుంది. ఉన్నావి అనుభవిస్తారు, లేనివి కోరుకోరు. అదే వైరాగ్యం. కనుక ఈ ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాక  వైరాగ్యం రావాలి

అంటే ముందు సాధకుడికి తెలియవలసింది నిత్య అనిత్య వస్తు వివేకం.

ఈ వైరాగ్యం కలగాలంటే ముందు రాగద్వేషాలు పోవాలి. రాగద్వేషాలు పోవాలి అంటే ప్రపంచం అశాశ్వతం పరమాత్మే శాశ్వతం అని తెలిసి ఉండాలి. ఇవి తెలిసినా మనకి బంధాలు ఉంటాయి. ఈ బంధాలను కూడా వదిలగలగాలి. ఏ మాత్రం చీమంత బంధం ఉన్నా మళ్లీ మనసు కలుషితం అవుతూ ఉంటుంది. ఈ వివేకము ఉన్నప్పుడు ఆ బంధాలను కూడా పోగొట్టుకుంటారు. ఏ వివేకము అంటే నాకు మోక్షం కావాలి అంటే ఈ బంధాలను కూడా వదులుకోవాలి అనే వివేకం ఉండాలి.

బంధాలు ఎన్ని రకాలుగా ఉన్నాయి అంటే! శరీరంతో బంధం ఉంటుంది, చుట్టూ ఉన్న ప్రపంచంతో ఉంటుంది, ఆస్తిపాసులు మీద ఉంటుంది. భార్యా పుత్రులుతో బంధం ఉంటుంది. ఇలా బంధాలలో పడిపోయినప్పుడు సాధన తగ్గిపోతుంది, అన్నీ తగ్గిపోతూ ఉంటాయి. అందుకని అప్పుడు ఈ బంధాలను కూడా తెంచుకోవాలి. ఈ బంధాలన్నీ ఈ జన్మకే, ఇవి మరుజన్మకి రావు అనేది మీరు అనుక్షణం గుర్తుంచుకోవాలి.

నిజంగా చెప్పాలంటే ప్రతీ ఒక్కరి జీవితంలో ఈ బంధాల వల్లే శాంతి లేకుండా పోతుంది. ఎప్పుడైతే ఎవరి మీదైనా మితిమీరిన మమకారం పెట్టుకుంటారో వారికి ఏ చిన్న కష్టం వచ్చినా బాధపడిపోతూ ఉంటారు. ఎందుకంటే అది నాది నావాళ్ళు అని ఈ బంధం పెంచుకున్న మూలానే ఎన్ని సాధనలు చేస్తున్నా, ఎన్ని వింటున్నా మళ్ళీ మనసు దుఃఖం అనే దాంట్లో కలుషితం అయిపోతూ ఉంది. మరి అలాంటప్పుడు శాంతి ఎలా కలుగుతుంది? మనసు నిర్మలంగా ఉండాలన్నా, శాంతిగా ఉండాలన్నా వివేకము, వైరాగ్యము, బంధరాహిత్యము... ఇవి అలవాటు చేసుకోవాలి.

మీరు నిత్యమూ ధ్యానము, యజ్ఞ కర్మలు చేస్తున్నా రకరకాల సాధనలు కాకుండా గురువు ఏదైతే చెప్పాడో అదే సాధన చేస్తూ ఉండాలి. ఇక్కడ నిజం చెప్పాలి అంటే గురువు చెప్పినప్పటికీ మీరు మారుస్తూ ఉంటే మీరు గురువుని మోసం చేసినట్లే.

గురువు మీ మీద దయతో ఏ మార్గం గుండా పయనిస్తే మోక్షానికి వెళ్తారో ఆ మార్గాన్ని బోధించినప్పుడు గురువు చెప్పిన మార్గాన్ని వదిలి వేరేగా పయనించినప్పుడు గురువుని మీరు మోసం చేసినట్లే అవుతుంది.

మరి ఆ విధంగా కూడా మీరు విజయం సాధించలేరు. భగవంతుడు అనుగ్రహం కలగాలి అంటే మీరు ఆ భగవంతుడు పంపిన గురువు మాట వినాలి. అలా వినలేని వాళ్ళకి మరి సద్గ్రంథాలు దొరికినా, చదివినా కూడా అర్థం కావు. అందుకే చాలామంది పుస్తకాలు కొనుక్కోరు. ఎందుకు కొనట్లేదు అంటే వాళ్ళకి చదివినా అర్థం కాదు.

మరి మామూలు ప్రాపంచిక చదువులు చదువుతున్నారు డిగ్రీలు కూడా అయినోళ్ళు ఉన్నారు వాళ్ళు ఏం చెప్తారంటే? ఏదో వీడియోలు వింటున్నాం కానీ మాకు బుక్స్ మీద పెద్ద ఇంట్రెస్ట్ ఉండదండి అంటారు. ఎందుకు ఇంట్రెస్ట్ ఉండట్లేదు అంటే? చదివినవి అర్థం కానప్పుడు వాళ్ళకి ఇంట్రెస్ట్ ఉండదు.

ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్ళినప్పుడు ఎదుటి వాళ్ళ మాటల ద్వారా వాళ్ళలో ఏ లోపాలు ఉన్నాయో మీకు అర్థమవుతూ ఉంటుంది. ఆ లోపాలను మీరు సరిదిద్దుకోవాలి. ఎందుకు అంటే చాలామంది పుస్తకాలు ఇంట్రెస్ట్ లేదు అంటారు. దానికి కారణం వారు సరైన ధ్యానం చేయక అంతర్గత శక్తి, మేధస్సు పెరగక, ఏకాగ్రత కుదరక, జ్ఞాపక శక్తి లేక, శ్రద్ధ లేక పుస్తకాలు చదవరు.

వాళ్ళకి పుస్తకాలు ఉంటాయి కానీ అర్థం కావు. అందుకే ఇలాంటి దుర్గుణాలన్నిటిని మనసు మాలిన్యాలు అంటారు. ఏంటి ఆ మాలిన్యాలు అంటే నిర్మలంగా లేకపోవడం, బంధాల్లో ఇరుక్కోవడం, వైరాగ్యం లేకపోవడం. ఇవన్నీ కూడా మనసుకి చెప్పినా చేయకపోతే అవి వాసనలైనా అవ్వాలి, సంస్కారాలైనా అవ్వాలి, మలినాలైనా అవ్వాలి అని చెప్తూ ఉంటారు.

ఎవరైతే నిత్యము తపస్సు అంటే అక్కర్లేని కోరికలు తగ్గించుకుంటారో, గురువు చెప్పిన సాధన చేస్తారో, నిష్కామంగా దానం చేస్తారో వారు మనసుకున్న దుర్గుణాలని వదులుకొని శాంతిని పొందుతారు. ఎందుకంటే ఈశావాస్యోపనిషత్

చెప్పింది మనకున్న సర్వ సంపదలు త్యాగ బుద్ధితో కొంత మందికైనా పెట్టి మనము అనుభవించాలి అని. మరి ఆ ఉపనిషత్తు సారాంశాన్ని మీరు అక్షరాల ఆచరించగలిగితే శాంతిగా జీవిస్తారు.

ఆ శాంతి ఉన్న మనసే శుద్ధంగా ఉంటుంది. శుద్ధంగా ఉన్న మనసే మరి మోక్షం పొందడానికి అరతని సంపాదించుకుంటుంది. అందుకే మోక్షం గురించి తెలిసినా ఆచరణలో లోపం ఉంటే ఎన్ని రోజులు, ఎన్ని జన్మలు తీసుకున్నా మరి మోక్ష స్థితిని పొందలేము అంటే ఆనంద స్థితిని పొందలేము.

ప్రతి మనిషి కోరుకునేది ఆనందమే. ఆ ఆనందం కోసమే భూమ్మీద ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ పొందలేకపోతున్నారు. కానీ ఒక జ్ఞాని, ఒక యోగి అది పొందుతున్నాడు. ఎందుకంటే ప్రపంచ పంచికంలో జీవించే వారికి సాధన ఉండక జ్ఞానం పెంచుకోవడానికి ప్రయత్నించరు.

వాళ్ళకి ఎంతసేపు ప్రాపంచిక జ్ఞానులకు, ప్రాపంచిక డిగ్రీలు ఉంటాయి కానీ పరమాత్మ జ్ఞానము, పరలోక జ్ఞానము తెలియదు. ప్రాపంచిక చదువులు నీ మనసు ఎంత కల్మషంగా ఉన్నా అబ్బుతాయి. మనసు ప్యూరిటీ లేకపోయినా డిగ్రీలు వస్తాయి కానీ పరమాత్మజ్ఞానము, పరలోక జ్ఞానము పొందాలి అంటే ముందు మీ మనసు బాగా శుద్ధత్వంలో ఉండాలి. శుద్ధత్వంలో లేకపోతే ఆ జ్ఞానం మీలో కలగదు.

ఎందుకు శుద్ధత్వంలో లేదు అంటే బుద్ధి శుద్ధత్వంలో లేదు. అందుకే మేము మిమల్ని బుద్ధిని వికసింప చేసుకోండి అని చెప్తాం. మీరు ఇవన్నీ తెలుసుకున్నప్పుడు, మనసు ప్యూరిటీ అవుతున్నప్పుడు, నిర్మలంగా ఉన్నప్పుడు అది నిశ్చలమై శాంతిని పొందినప్పుడు మాత్రమే మన సాధన కానీ, నిష్కామ కర్మ కానీ, దానం కానీ ఇవన్నీ మనము అలవాటుగా చేసుకుంటాం. అలా అలవాటు చేసుకున్నప్పుడు బ్రతికి ఉండగానే భూమిమీద శాంతిగా మోక్ష స్థితిలో ఉండగలుగుతారు.

# అజ్ఞానానికి మూలం ఏంటి?

ఎవరైనా జ్ఞానం పొందుతూ ఉంటే చీకటి నుంచి వెలుతురులోకి వస్తూన్నట్టే! అలా ఆత్మజ్యోతిని దర్శించే వరకు ఆ ప్రయాణం సాగుతునే ఉంటుంది. దీపావళి అంటే బయట దీపం వెలిగించడం కాదు, శరీరం లోని ఆత్మజ్యోతిని వెలిగించుకోవాలి. కాని బయట దీపం వెలిగించడం అంటే అజ్ఞానమే అనాలి.

మరి ఈ అజ్ఞానం ఎలా పుట్టింది? దీనికి మూలం ఏంటి? ఈ అజ్ఞానాన్ని తొలగించుకునే మార్గం ఏమిటి? అన్నది తెలుసుకుందాం.

ఈ శరీరం నేను అనే భావమే పెద్ద అజ్ఞానం, దీన్నే దేహ భ్రాంతి అంటారు. మానవుడు ఎన్నో జన్మలు తీసుకుని చిట్ట చివరిగా మానవ జన్మ తీసుకున్నాక, తానే భగవంతుడు అని తెలుసుకోవాలి.

కానీ మానవుడు తానే భగవంతుడు అని తెలుసుకోలేక తాను శరీరం అని భావిస్తున్నాడు. ఈ దేహ భ్రాంతికి కారణం పుట్టినప్పటి నుంచి నేను శరీరం అనే స్థితిలో పెరిగి, ఆ శరీరం వల్ల బంధాలని ఏర్పరచుకుని ఇంకా ఇంకా అజ్ఞానంలో కూరుకుపోతున్నాడు.

తర్వాత ఈ ప్రపంచం శాశ్వతం అనే భ్రాంతిలో పడిపోతున్నాడు. ఇలా ఈ రెండు భ్రాంతుల వల్లే అజ్ఞానంతో నేను, నాది అనుకుంటూ ఈ లోకంలో ఏర్పరచుకున్నవి, సంపాదించుకున్నవన్నీ కూడా నావి అనే అభిప్రాయంతో జీవిస్తున్నాడు.

అయితే ఈ భ్రాంతి ఎంతవరకు ఉంటుందంటే? మానవ జన్మకు వచ్చి మొట్టమొదట్లో తమోగుణంలో ఉంటాడు. తమోగుణంలో నేను, నాది అనే అజ్ఞానం చాలా తీవ్రంగా ఉంటుంది, ఇది ఒక పట్టాన మారదు. ఎంత చెప్పినా కొంతమంది ధ్యానంలోకి రాలేరు, అజ్ఞానాన్ని వదలలేరు దానికి ఈ

తమోగుణమే కారణం.

ఇక రజో గుణంలోకి వచ్చేటప్పటికి తను ఏదైనా సంపాదించుకుంటే నా వల్లే ఇంత పెరుగుతుంది అని అహంకారం పెంచుకుంటారు. తమో గుణంలో అజ్ఞానం ఉంటే, రజోగుణం వచ్చేటప్పటికి అహంకారం దానికి జతకట్టి ఎవ్వరు ఏమి చెప్పినా నేను వినను, నాకు తెలిసున్నదే కరెక్టు అనే అభిప్రాయం తీవ్రతరం చేసుకుంటారు.

ఇలా కొన్ని జన్మలు గడిచాక కష్టాలు పెరుగుతాయి. అప్పుడు నేను ఎలా బయటపడాలి అని ఆలోచిస్తున్నప్పుడు వాళ్ళకి దైవము గుర్తుకు వస్తాడు. అలా కష్టాలు వచ్చినప్పుడు మాత్రం దైవాన్ని ఆశ్రయిస్తారు. దైవానికి మొక్కుకుంటే, పూజ చేస్తే కష్టాలు పోతాయి అని భావిస్తూ ఉంటారు. అందుకే చాలామంది విగ్రహమే భగవంతుడు అనే అభిప్రాయంలో ఉండి పూజలు చేస్తూ ఉంటారు.

కానీ ఆ గుణం నుంచి సాత్విక గుణంలోకి వచ్చినప్పుడు మనసు సాత్వికంలోకి వస్తుంది. కొద్ది కొద్దిగా దానధర్మాలు చేస్తూ ఉంటారు, అలా సేవా భావంతో ఉంటారు.

ఇక్కడ గమనిస్తే అందరి కోసం కొంచెం పుణ్య కర్మలు చేస్తూ ఉంటారు కానీ, నేనే చేస్తున్నాను అనే భావన సాత్విక గుణంలోకి వచ్చినా కూడా వదలదు. దైవం మీద కొంచెం అభిమానం ఉన్నా విగ్రహంలో మాత్రమే దైవాన్ని చూస్తారు, దాన ధర్మాలు చేస్తారు.

ఇలాంటి పరిస్థితుల్లో వీరి జీవితంలోకి సద్గురువులు వచ్చి ఆత్మే దైవం అనే సత్యాన్ని చెప్తారు. నీలోనే కాదు సర్వ జీవులలోనూ అంతర్యామిగా ఆత్మఅనే భగవంతుడున్నాడు అని చెబుతారు. ఈ శరీరం శాశ్వతం కాదు, ఇది మలమూత్ర బాండం. ఈ దేహాన్ని చూసుకుని నువ్వు దేహ భ్రాంతిలో ఉండి, నీకు సంబంధం ఉన్న ప్రతీ వాళ్ళతో బంధాన్ని ఏర్పరచుకుని, ఈ సంపాదించినవన్నీ నావి, నావి అనుకుంటూ అహంకారం, అజ్ఞానం

పెంచుకుంటున్నావు కానీ ఆత్మే దైవం అని తెలుసుకోవట్లేదు.

ఈ దేహం నుండి ఆత్మ తప్పుకోగానే దీన్ని స్మశానంలో బూడిద చేస్తున్నారు. ఈ శరీరం బూడిదైనా మోక్షానికి అర్హత లేదు. ఈ శరీరం ఆత్మకి ఒక తొడుగే కానీ ఇది శాశ్వతం కాదు అని గురువు చెప్పినప్పుడు అర్థంచేసుకుంటారు.

చాలామంది ఆత్మే దైవం అని నమ్మినా ఈ లోక వాసనలు, దేహ వాసనలు వదలక ఇంకా పూజలు చేస్తూ. ఇంకా ఇవి నావి, నేను చేశాను అనే భావం పూర్తిగా వదలరు.

నావి, నేను అనుకున్నన్నాళ్ళు ఇంకా అజ్ఞానంలో ఉన్నట్టే. సాధన మొదలుపెట్టాక, మెల్లి మెల్లిగా గురువు యొక్క బోధ విన్నాక, స్వాధ్యాయం ద్వారా ఇవన్నీ చదివి తెలుసుకోవడం వల్ల జ్ఞాన పరిధి పెరిగి ఆ వాసనలు వదులుతారు.

ఈశావాశ్యోపనిషత్తు చదవకపోతే ఈ సంపదలన్నీ తామే సంపాదించా మంటారు. నిజంగా వారు సంపాదించలేదు, పుణ్య కార్యాలు చేశారు, ఆ పుణ్యం వల్ల ఈ జన్మలో ఈ భోగం వచ్చింది. అంటే భగవంతుడి చేత ఇవ్వబడింది. కారణం ఈ సంపదలన్నీ భగవంతుడివే. ఎవరికైనా వాటిని అనుభవించడానికి మాత్రమే హక్కు ఉంది, అందుకే కూడా తీసుకెళ్లలేరు.

ఈ శరీరం శిధిలమైపోయి ఇక్కడే పంచభూతాలలో కలిసిపోతుంది. ఆత్మ మాత్రం పైలోకాలకి వెళ్తుంది, వెళ్తూ వెళ్తూ ఈ భోగాలని తీసుకువెళ్ళదు అని గురువు ద్వారా, శాస్త్రాల ద్వారా తెలుసుకున్నాక వీటి మీద మెల్లిగా మమకారం తగ్గించుకుంటారు.

ఎంతవరకు ఈ భ్రాంతులను, మమకారాన్ని పెంచుకుంటారో అంతవరకు పరమాత్మ తత్వం అర్థం కాదు. ఇది నశించే శరీరం, నేను ఆత్మని. నేనే పరబ్రహ్మని అని నిత్యము ఎరుకలో ఉండాలి. ఈ ఆత్మకి శరీరం ఒక తొడుగే కానీ శరీరం నేను కాదు అని దేహ భ్రాంతి ఎంతగా తగ్గించుకుంటారో

దైవం మీద భక్తి, ప్రేమ అంతగా పెంచుకుంటారు.

నేను వెతుకుతున్న దైవం ఎక్కడో లేడు ఈ శరీరంలోనే ఆత్మగా ఉన్నాడు అని ఎప్పుడైతే తెలుసుకొని నిత్యము ఆ ఎరుకలో ఉండగలుగుతారో అప్పుడు వారికి జ్ఞానం వచ్చినట్లు లెక్క.

ఎవ్వరికైనా ఈ దేహ భ్రాంతి ఒక్కసారే పోదు, ఒక్క జన్మలో కూడా పోకపోవచ్చు. కానీ అనుక్షణము నేను ఆత్మని అనే ఎరుకలో ఉన్నప్పుడు వారి పనులు ఉన్నతంగా ఉంటాయి. వారిలో ప్రేమతత్వం, త్యాగ భావం ఇంకా పెరుగుతాయి.

ఈ శరీరాన్ని వస్త్రం ఎలా కప్పుతుందో ఆత్మని కూడా ఈ దేహం అలా కప్పుతుంది. వస్త్రం పాడైపోయినప్పుడు, చిరిగిపోయినప్పుడు వస్త్రం మార్చినట్టే, ఈ దేహం సాధనకి పనికి రానప్పుడు ఆత్మ కూడా ఈ శరీరాన్ని వదిలి పెట్టేస్తుంది.

అందుకే గురువులు మొట్టమొదట నువ్వు శరీరం కాదు నువ్వు ఆత్మవి. ఇది ఒక వస్త్రం లాంటిది, ఒక తొడుగు మాత్రమే. ఈ తొడుగు సాధన కోసం తెచ్చుకున్నావు, అది మర్చిపోయి శరీరం నేను అనే భ్రాంతిలో ఉన్నావు అని బోధించాక మొదట్లో అర్థం కాదు, కానీ మెల్లి మెల్లిగా సాధన పెంచుకుంటూ, స్వాధ్యాయం చేస్తూ, గురువు ద్వారా జ్ఞానాన్ని వింటున్నప్పుడు అర్థం అవుతుంది. అప్పుడు వారి అభిప్రాయం మార్చుకుని శుద్ధసాత్విక గుణంలోకి వస్తారు.

ఈ శుద్ధ సాత్వికంలోకి వచ్చినప్పుడు  ఎప్పుడూ మంచి పనులే చేస్తారు. అలా శుద్ధ సాత్వికం లోకి వచ్చి దైవం మీద అభిమానం పెరిగినప్పుడు ఈ బుద్ధి; శుద్ధ బుద్ధిగా మారుతుంది.

భగవంతుడికి నచ్చని మనసు యొక్క గుణాలు ఈర్ష్య, అసూయ, స్వార్థం.  కానీ ఆత్మ యొక్క లక్షణాలు సేవ, ప్రేమ, త్యాగం. అందుకే అందరిని ప్రేమించగలగాలి, సర్వజీవుల సేవే సర్వేశ్వరుడి సేవ అని తేలుకుంటారు. జీవులకి సేవచేస్తే జీవేశ్వరుడికి సేవ చేసినంత పుణ్యం వస్తుంది అని

తెలిసినప్పుడు ఎవ్వరినీ తక్కువగా చూడరు, ఎవ్వరినీ ఎక్కువగా చూడరు.

నేను ఆత్మ స్వరూపుడ్ని, నేనే కాదు లోకంలో అందరూ ఆత్మ స్వరూపులే. జీవులు కానీ, ఈ పంచభూతాలు కానీ, కనిపిస్తున్న ప్రపంచమంతా కూడా పరమాత్మ యొక్క చైతన్యంతో నడపబడుతుంది అని అర్థమైనప్పుడు దేన్నీ తక్కువగా చూడరు.

అలా ఉండగలిగితే వారిలో అజ్ఞానం పూర్తిగా నశించినట్టే. ఇక్కడ చూడండి తమోగుణంతో అజ్ఞానం మొదలైంది. రజోగుణంతో అజ్ఞానం పెరిగింది. కానీ సాత్వికం వచ్చాక సత్యాన్ని తెలుసుకున్నాక మెల్లి మెల్లిగా అజ్ఞానాన్ని తగ్గించుకుంటూ.. నేను ఆత్మని అనే అభిప్రాయం స్థితమైనప్పుడు పూర్తిగా అజ్ఞానం తొలగి జ్ఞానము మొదలవుతుంది.

అనుకోవడం వేరు, అనుభవంలోకి తెచ్చుకోవడం వేరు. తెలుసుకుంటే సరిపోదు అనుభవంలోకి తెచ్చుకోవాలి. అంటే ఒక వ్యక్తిని చూసిన వెంటనే వీడు ఫలానా కులం, వీడు ఫలానా మతం, లేదా వీడు కోటీశ్వరుడు, వీడు బికారి ఇలా అభిప్రాయాలు ఏర్పరచుకుంటారు. కానీ ఒక వ్యక్తిని చూసినప్పుడు ఏ అభిప్రాయం లేకుండా వీడు కూడా ఆత్మ స్వరూపుడే ఏవో అనుభవాలు పొందడానికి భూమ్మీదకు వచ్చాడు, అని తెలుసుకుంటాడు.

వాడు అలాంటివాడు, వీడు ఇలాంటివాడు అని వాళ్ళ గుణాల గురించి కానీ, రంగూ రూపు గురించి కానీ, వాడికి ఉన్న ఆస్తిపాస్తుల గురించి కానీ, దేని గురించి ఆలోచించకుండా, చూడకుండా, ఉండగలిగితే వారు అందరినీ ఆత్మలుగా చూస్తున్నట్టు. వారిలో అజ్ఞానం పూర్తిగా పోయినట్టు. మీరు జ్ఞానవంతులైనా అవతలవాడు అజ్ఞానంలో ఉంటే మీరు వాళ్ళ మీద ద్వేషం, ఈర్ష్య పెంచుకోకూడదు. పూర్ణ జ్ఞానం పొందితే అన్నీ సాక్షిగా గమనిస్తారు.

ఇతరులు ఎన్ని అన్నా కూడా ఏదో ఒకరోజు తెలుసుకుంటారని మీరు మౌనంగా ఉంటే అవతల వ్యక్తిలో ఆలోచన మొదలవుతుంది. మనం

ఎన్ని మాటలు మాట్లాడినా వీళ్ళు మౌనంగా ఉన్నారు అంటే వాళ్ళలో నాలో లేని గుణం ఏదో ఉంది అని అక్కడి నుంచి వాళ్ళ ఆలోచనలు ఈ జ్ఞానం వైపుకు మరలుతాయి.

బాగా అజ్ఞానం ఉంటే వాళ్ళు అసలు ఎవరి మాటా వినరు. అలాంటి మూర్ఖత్వం, అహంకారం ఉన్న వాళ్ళకి సత్యాన్ని ఒకసారి బోధించాలి కానీ మారతాడని మాత్రం ఆశించనవసరం లేదు. ఎందుకంటే అది వాడి మనోస్థితిని బట్టి ఆధారపడి ఉంది. అందుచేత మీరు చెప్పినా వాడు మారలేదే అని మీరు బాధపడకూడదు.

మీరు సాధన తీవ్రంగా చేసి, స్వాధ్యాయం బాగా చేసి, నిష్కామ కర్మ చేస్తూ ఉంటే, త్యాగ బుద్ధితో సేవ చేస్తూ, ప్రేమతో ఉంటే ఈ జన్మనే చివరి జన్మ చేసుకోవచ్చు.

మహాత్ములు ఏమన్నారంటే? అజ్ఞానిగా పుట్టడం తప్పు కాదు, కానీ మానవ జన్మ తీసుకున్నాక జ్ఞానిగా మరణించాలి అని అన్నారు.

మరుజన్మ లేకుండా చేసుకోవడానికే మానవ జన్మ అని తెలుసు కోవాలి. నేను మరణించేలోగా జ్ఞానం నేర్చుకుంటాను అనే తపన ఉండాలి. మరణించే లోగా నేను జ్ఞానవంతుడ్ని అవ్వాలి అనే కోరిక మీకు ఉండాలి.

అలా దేహాన్ని మీ అవసరాలకు వాడుకుంటూ సాధన మీరు చేయాలి, అప్పుడు అజ్ఞానం పోతుంది. అజ్ఞానానికి మూలం శరీర భ్రాంతి, లోక భ్రాంతి, నేను శాశ్వతంగా ఉంటాను అనే ఒక భ్రమే. అందుకే “ఆ భ్రమని వీడితే బ్రహ్మమే అవుతావు” అని గురువులు చెప్తూ ఉంటారు.

ఈ జన్మే చివరి జన్మ చేసుకునే అవకాశం ప్రతి ఒక్కరికి ఉంది, కానీ ప్రయత్న లోపం ఉండకూడదు. నిరంతరము సాధన చేయడం, జ్ఞానాన్ని పెంచుకోవడం దినచర్యలో ఒక భాగంగా చేసుకున్నప్పుడు చక్కగా ఎదుగుతారు. అజ్ఞానం పోతుంది.

# ఇంద్రియ నిగ్రహం ఎందుకు ఉండాలి?

ప్రతివారు ధ్యానం వల్ల శక్తి పొందుతూ, శ్రవణం వల్ల జ్ఞానాన్ని పొందుతూ జీవితంలో ఎన్నో మార్పులు తెచ్చుకుంటున్నారు. ఈ జ్ఞానం పెరిగితే కానీ ఆనందం అనేది ఉండదు అని తెలుసుకున్న వారికి జ్ఞానం పొందాలి అనే తపన ఎక్కువగా ఉంటుంది. మరి జ్ఞానం పొందాలి, సాధన కుదరాలి అంటే ఒక సాధకుడికి ముఖ్యంగా ఉండవలసింది ఇంద్రియ నిగ్రహం.

ఎవరైతే ఈ ఇంద్రియ నిగ్రహం పాటిస్తారో వారు పరిపూర్ణమైన జీవితం జీవించగలరు, మోక్షాన్ని పొందగలరు, ఈ భూమిమీద ఉండగానే ఆనంద స్థితిలో ఉండగలరు. అందుకే మహాత్ములు ముందు శిష్యులకి ఇంద్రియ నిగ్రహం ఉండాలి అని బోధిస్తూ ఉంటారు. అంటే మీ మనసుని చెదరగొట్టే సంఘటనలు ఎదురుగుండా ఎన్ని జరుగుతున్నా మార్పు లేకుండా ఉండగలగాలి. ఇంద్రియ నిగ్రహం లేకపోతే చిల్లు కుండలో నీళ్లు తెచ్చుకున్నట్టే. చిల్లు కుండలో నీళ్లు తెచ్చుకుంటే ఎలా మిగలవో అట్లాగే ఎంత సాధన చేసినా, ఎంత జ్ఞానం విన్నా ఇంద్రియ నిగ్రహం లేకపోతే  జ్ఞానం పొందలేరు.

ఇంద్రియ నిగ్రహం లేనివాడు ఇంద్రియాలకి బానిసై ఒక్కొక్కసారి ఈ ధ్యానం కూడా వదిలేస్తాడు.  ధ్యానం కంటే జ్ఞానం తెలుసుకున్నవాడు ధ్యానం మీద, జ్ఞానం మీద ఆసక్తి పెంచుకుంటాడు. ఈ జ్ఞానం అన్నది మంద బుద్ధులకి అర్థం కాదట. మరి బుద్ధి ఎందుకు అంత మందంగా ఉంది అంటే? ఆహారంలో లోపం వల్ల మనసులో లోపం ఏర్పడి, బుద్ధిలో లోపం ఏర్పడుతుంది.

అందుకే రుచులకు మరిగి ఆహారం ఎలా పడితే అలా అస్తవ్యస్తంగా తీసుకోవడం వల్ల ఇంద్రియ నిగ్రహం కోల్పోతారు, మనసుకి బానిసలు అవుతారు. ప్రపంచం వైపు తిరిగిన మనసు ఇంద్రియ నిగ్రహం ఎప్పుడూ కోల్పోతూ  ఉంటుంది. అందుకే సాధనలోకి వచ్చిన వాడికి ఇంద్రియ నిగ్రహం

లేకపోతే చాలా కష్టం.

పత్రి గారు మాంసాహారం వద్దు అన్నారు. ఎందుకంటే అది పాపాహారము, రజోగుణాన్ని పెంచే ఆహారము. దాన్ని తీసుకోవడం వల్ల ఇంద్రియాలు అదుపు తప్పిన గుర్రాలలాగ పరిగెడుతూ ఉంటాయి, ఇది తినకూడదు, అది చూడకూడదు, ఇవి వినకూడదు, అలా మాట్లాడకూడదు అని ఎన్నో తెలుసు కాని కొన్ని సందర్భాలలో మాట్లాడకూడనివి మాట్లాడేస్తూ ఉంటారు, చూడకూడనివి చూస్తూ ఉంటారు, వినకూడనివి వింటూ ఉంటారు, చెయ్యకూడనివి చేస్తూ ఉంటారు.

ఎవరికైనా ఎక్కువ ప్రమాదం నోటి వల్లే వస్తూ ఉంటుంది. ఆ నాలుక రుచి మరిగి ఇంద్రియ నిగ్రహాన్ని కోల్పోతారు, ఆహార నియమాలు పాటించలేరు. సాధకుడికి ముఖ్యంగా ఇంద్రియ నిగ్రహం ఉండాలి అది లేకపోతే వాళ్ళు సాధనలో పట్టు సాధించలేరు. ఇప్పుడు చూడండి చాలామంది సన్యాసి వేషం వేసుకుంటారు, కానీ ఒక్కోసారి వాళ్ళు కూడా నాలిక రుచికి బానిసై ఆహార నియమాలు పాటించలేక అన్ని రకాల పదార్థాలు తినడం వల్ల సాధన సరిగ్గా చేయలేక మధ్యలోనే వదిలిపెట్టేస్తారు. ఇలాంటి వాళ్ళు వారు ధరించిన బట్టలకే అవమానం తీసుకొస్తారు, వీళ్ళకి సాధన ఉండదు. అందుకే థియరీ వచ్చింది కానీ ప్రాక్టికల్ గా అనుభవం పొందరు.

ఇక్కడ కాషాయ వస్త్రాలు ధరించినంత మాత్రాన సన్యాసి అవ్వడు, సన్యాసి అంటే సత్యాన్ని తెలుసుకున్నవాడు, సత్యంలో జీవించేవాడు. ఈ సన్యాసుల్లో సత్యాన్ని తెలుసుకున్న వాళ్ళూ ఉంటారు, తెలుసుకోవాలని ఆసక్తితో సాధన చేసేవాళ్ళు ఉంటారు. నిజానికి మీరంతా కాషాయం కట్టుకోని సన్యాసులు. ఎందుకంటే మీరంతా సత్యాన్ని తెలుసుకున్నారు, సత్యాన్ని చెప్పగలుగుతున్నారు.

మీకు రాఘవరావు గారు సాధన బాగా కుదరాలి అని చాలాసార్లు ఆహార నియమాలు పాటించాలని చెప్తారు. మరి అవి పాటిస్తు సాధన చేస్తున్నా

ఒక్కొక్కసారి సాధన కుదరకపోతే వెంటనే ఈవేళ నా ఆహారంలో ఏదో లోపం ఉంది అని గమనించుకుని సరి చేసుకోవాలి.

మీరు ఆహారానికి బానిసలైపోతే జీవితంలో విజయం సాధించలేరు. ఆహార నియమాలు పాటిస్తూ సాధన చేసేవారు జీవితంలో ప్రతి దాంట్లోనూ ఖచ్చితంగా విజయం సాధిస్తారు. విజయానికి మూలం సాధన అని పతంజలి మహర్షికి తెలుసు, అందుకే సాధన చేస్తున్న వాళ్ళు ఈ సలహ తప్పకుండా పాటించాలి అంటాడు. నువ్వు ఆహార నియమం పాటిస్తే విజయం నీది అవుతుంది.

ఎవరైనా సరే ఇంద్రియ నిగ్రహం లేకుండా ఇంద్రియాలకి బానిసలు అయిపోతున్నారంటే ఖచ్చితంగా ఆహార నియమాలు పాటించట్లేదు అని చెప్పుకోవాలి. ఇక్కడ ఇంద్రియాలు అంటే నోటిని మాత్రమే నిగ్రహించుకోవడం కాదు కళ్ళు, చెవులు, ముక్కు, అంతరేంద్రియమైన మనసు, కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు వీటన్నిటిని కూడా నిగ్రహించు కోవాలి. ఆఖరికి అంతరేంద్రియమైన మనసుకు కూడా బానిస అవ్వకూడదు.

ఇంద్రియాలు ఎలా నిగ్రహించుకోవాలో తాబేలును చూసి నేర్చు కోవచ్చు. తాబేలు పని ఉంటే చేసుకుని పని లేనప్పుడు ఇంద్రియాలను లోపలికి ముడుచుకొని ధ్యాన స్థితిలో ఉండిపోతుంది. వ్యర్థమైన పనులకి తన ఇంద్రియాలని ఎప్పుడూ ఉపయోగించదు. అందుకే అది 400 సంవత్సరాలు బ్రతుకుతుంది. అది నీటిలోనూ జీవించగలదు, బయట కూడా జీవించగలదు. రెండిటిలోను జీవించగలిగే పట్టు అది సంపాదించింది.

అలాగే మీరు కూడా ఇంద్రియ నిగ్రహం పాటిస్తూ ధ్యానం చేయడం వల్ల బాహ్యేంద్రియాల మీద పట్టు ఉంటుంది, అంతరేంద్రియమైన మనసు మీద కూడా పట్టు ఉంటుంది. బాహ్య ప్రపంచంలో తిరిగినప్పుడు మీరు ఎక్కువ మాయకు వశమైపోతూ ఉంటారు. అలా వశమవ్వకుండా ఉండగలిగే శక్తి ధ్యానం వల్ల వస్తుంది.

అందుకే మహాత్ములు నీ మనసు బయట ప్రపంచంలో తిరుగుతూ నువ్వు మాయకి వశమై ఉన్నన్నాళ్ళు నువ్వు నరుడుగానే జీవిస్తావు. మాయని జయిస్తే నారాయణుడివి అవుతావు అని చెప్తారు. మరి మాయని జయించ లేకపోవడానికి కారణం అంతరేంద్రియమైన మనసు ఇంకా చంచలవస్థలో ఉండటం, ఇంద్రియ నిగ్రహం లేకపోవడం.

ఇంద్రియాలన్నీ మనసుకి బానిసల్లా పని చేస్తున్నాయి అంటే మీరు సరైన ఆహార నియమాలు పాటించక మనసు చెప్పినట్టు వింటున్నారు. చూడండి సాధారణ మానవుడు మనసు చెప్పినట్టు జీవిస్తాడు, కానీ ఒక సాధకుడు ఒక జ్ఞాని మనసును తన అధీనంలో ఉంచుకొని, ఇంద్రియాలను తన అధీనంలో ఉంచుకొని, అన్నిటి మీద ఆధిపత్యం సంపాదించి తాను బ్రహ్మజ్ఞానిగా మిగిలి పోతాడు.

ఇప్పుడు మీలో ఒక్కొక్కరికి ఒక్కోరకమైన ఇష్టం ఉంటుంది. కానీ సాధన చేస్తూ పెద్దలు చెప్పిన మాటలు, గురువులు చెప్పిన మాటలు, గొప్పవాళ్ళు చెప్పిన మాటలు రోజూ వినడం వల్ల ప్రతి విషయం, ప్రతి నిమిషము ఇది అవసరమా? కాదా? అని విచారణ చేసుకోగలుగుతున్నారు. నిత్య అనిత్య వస్తు వివేకం ఉండడం వల్ల కళ్ళుతో చూసినవి కావాలని అనిపిస్తున్నా వెంటనే వివేకం వల్ల అక్కర్లేని వాటికి నేనెందుకు తాపత్రయ పడాలని నిగ్రహించు కుంటున్నారు.

ఇక్కడ కళ్ళు చూస్తున్నాయే కానీ కళ్ళ వెనుక ఉన్న కోరిక మనసుది, చెవులు వింటున్నాయి ఆ కోరికా మనసుదే, నోరు తింటుంది, మాట్లాడుతుంది ఆ కోరిక కూడా మనసుదే. అందుకే ఒక జ్ఞాని మనసు మీద ఆధిపత్యం సంపాదిస్తాడు. అలా జ్ఞాని ఎప్పుడైతే ఆధిపత్యం సంపాదిస్తాడో అన్నీ వింటూ, అన్నిటి మీద నిగ్రహం సంపాదించి, ఇంకా ముందుకి వెళ్తూ ఒక బ్రహ్మజ్ఞానిగా ఎదిగిపోతాడు.

అప్పుడు ఆ బ్రహ్మజ్ఞాని యొక్క హృదయం విశ్వమంత విశాలంగా

ఉంటుందని మనకి మహాత్ములు చెప్పడం జరిగింది. మరి వాళ్ళకి అంత విశాలంగా ఎట్లా కుదిరింది అంటే! వాళ్ళ జీవితంలో సేవ, ప్రేమ, త్యాగం అనేవి సహజ గుణాలై వాళ్ళ హృదయాన్ని విశ్వమంత విశాలంగా చేసుకుంటారు. అందుకే వాళ్ళు ఎప్పుడూ లోక కళ్యాణకరమైన పనులు చేస్తూ ఉంటారు.

ఒక చిన్న విషయాన్ని మీరు అశ్రద్ధ చేస్తే అంటే ఈ వేళ ఒక్క రోజే కదా అని అలాంటి ఆహారం తీసుకుంటే! ఆ ఒక్కరోజు మనసు కలుషితమైతే మనసుకి బానిసలై ఇంద్రియ నిగ్రహం కోల్పోతే తప్పు మీద తప్పు చేస్తూ ఆత్మకు దూరమై, ప్రపంచానికి దగ్గరై, కోరికలు పెంచుకుంటూ, సంకల్పాలు పెట్టుకుంటూ, జీవుడిగానే బ్రతుకుతారు.

నరుడిగానే మళ్ళీ భూమిమీదకి వచ్చి చచ్చి పుట్టి జన్మ రాహిత్య స్థితి పొందలేక జన్మ పరంపరలో కొట్టుకుపోతారు. అలా నిగ్రహం లేనివాడు ఎంతో దిగజారుతాడు. అందుకే మహాత్ములు మనకో మాట చెప్తూ ఉంటారు. నాలికని నిగ్రహించు, మాటని నిగ్రహించు అని. ఎందుకంటే రుచికి నాలికని నిగ్రహించకపోతే అక్కడి నుంచి తప్పులు చేయడం మొదలవుతుంది. మరి మాటను నిగ్రహించకపోతే ఎన్నో కర్మలు పొంగేసుకుంటూ ఉంటారు.

ఏ నోరైతే ఆహారాన్ని లోపలికి పంపిస్తుందో, ఆ నోరే మాటల్ని కూడా బయటకు పంపిస్తుంది. భగవంతుడు ఎంత చిత్రమైన పని చేశాడో చూడండి. రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు నాసిక రంధ్రాలు, రెండు చేతులు, రెండు కాళ్ళు ఇచ్చాడు. నోరు మాత్రం ఒకటే ఇచ్చాడు, అంటే ఒక్కదానితోనే రెండు పనులు చేయాలి.

ఒకడు బ్రహ్మదేవుడిని అడిగాడట స్వామి అన్నీ రెండు రెండు ఇచ్చావు, నోరు మాత్రం ఎందుకు ఒక్కటే ఇచ్చావు? ఇది ఒకటే ఉండడం వల్ల మేము తింటున్నప్పుడు మాట ఆపవల్సి వస్తుంది. ఇది కూడా రెండు ఇస్తే ఎంత బాగుండేది అన్నాడట.

అప్పుడు బ్రహ్మదేవుడు చెప్పాడట మానవులకి తెలివిని, బుద్ధిని ఇస్తే

అవి ఉపయోగించుకుని ఉన్నత స్థితికి చేరకుండా ప్రపంచమే శాశ్వతం, శరీరమే శాశ్వతం అనుకుంటూ ఆ నోటితో తినకూడనివి తింటూ, అనకూడనివి అంటూ మళ్లీ వెనక జన్మలకే వెళ్తున్నారు. ఒక్కటి ఇస్తేనే అదుపు లేకుండా ఇన్ని కర్మలు చేస్తున్నారు, మరి రెండు ఇస్తే ఈ ప్రపంచాన్ని ఇలా ఉండనిస్తారా? అని అన్నాడట.

మీకు ఏమి ఇవ్వాలో మిమల్ని సృష్టించిన సృష్టికర్తకు తెలుసు. మీరు నిగ్రహం లేకుండా ఉంటారు కాబట్టే ఆ నిగ్రహాన్ని మర్చిపోతారు అని మళ్ళీ గురువుల ద్వారా పదే పదే తెలియజేస్తూ ఉంటాడు.

ఆహార నియమము పాటించిన వాడికి సత్యమైన ఆలోచనలు అంటే భగవంతుడి గురించే ఆలోచనలు వస్తాయి. ఎవరైతే ఎప్పుడూ ఆత్మ గురించే ఆలోచిస్తారో, ఆత్మ శక్తిని పెంచుకోవడానికి ప్రయత్నం చేస్తారో. వాళ్ళని సత్పురుషులు అంటారు. ఒక పూర్ణ జ్ఞాని ఎట్లా అవుతాడు అంటే ముందు ఆహార నియమాలు పాటిస్తూ, ఆ తర్వాత మనసుని నిగ్రహించుకుంటూ, ఆ తర్వాత ఇంద్రియాలను నిగ్రహిస్తూ ఉండడం వల్ల సత్యమైన ఆలోచనలు చేస్తాడు, సత్భావనలు కలిగి ఉంటాడు, సత్య వాక్కులే మాట్లాడుతాడు.

ఆలోచనలు భగవంతుడి వైపే ఉంచి ప్రతిదీ ఆచరిస్తూ, శిష్యుల చేత ఆచరింప చేసేవాడినే ఆచార్యుడు అంటారు. సత్యంలో జీవించేవారు ఎప్పుడూ కూడా ఆత్మని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకువెళ్లే ఆలోచనలు, పనులే చేస్తారు. వాళ్ళ నోటి వెంట అసత్యం వస్తే మళ్లీ కర్మ పోగై, మళ్లీ జన్మ వచ్చి మాయకు వశమై ప్రపంచంలో పడిపోతారని వాళ్లకి తెలుసు కాబట్టి వాళ్ళ నోటి వెంట ఎప్పుడూ సత్యవాక్కులే వస్తాయి.

వీళ్లు ఎప్పుడూ లోక కళ్యాణకరమైన పనులు, సత్కార్యాలే చేస్తారు. అందుకే ఆహారం మీద పట్టు ఉన్నవాడికి మనసు మీద అదుపు ఉంటుంది. ఇంద్రియాల మీద అదుపు ఉండడం వల్ల సత్కార్యాలే చేస్తారు. ఇలా సత్కార్యాలు చేసేవారు దివ్య మానవులుగా భూమిమీద వెలుగొందుతూ ఉంటారు.

అందుకే పూర్వం కొందరు రాజులు తమ రాజ్యాన్ని బిడ్డలకు అప్పచెప్పి, దూరంగా వెళ్లి సదా సాధనలో ఉంటూ.. అక్కడ దొరికే ఆ పళ్ళు తింటూ జీవించేవారు. దాన్నే వానప్రస్త్రాశ్రమం అంటారు. ఎవరైనా సరే ఐదు పదుల వయసు వచ్చేటప్పటికి ఐదు ఇంద్రియాల మీదా పట్టు సాధించాలట. అలా సాధించిన వాడు మహాపురుషుడు అవుతాడు అని గురువులు, మహాత్ములు చెప్పడం జరిగింది. అందుకే సాధనకి ఇంద్రియ నిగ్రహం ఎంతో అవసరం.

మీకు మంచి చేసేది ఆహారమే, చెడు చేసేదీ ఆహారమే. మరి ఏ ఆహారం మంచి చేస్తుంది అంటే? పరా ప్రకృతితో వృద్ధి చెందిన శాకాహారం శరీరానికి, మనసుకి మంచి చేస్తుంది. కాని హింసతో కూడిన మాంసాహారం శరీరానికి చెడ్డ చేయడమే కాదు రజోగుణాన్ని, తమోగుణాన్ని, అహంకారాన్ని పెంచి కర్మలు ఎక్కువ చేయించి వాళ్ళని భూమ్మీద పడేస్తుంది.

ఇప్పుడు చాలామందికి మాంసాహారం తినడం గొప్ప, భోజనాల్లో ఎక్కువ రకాలు పెట్టడం గొప్ప అనుకుంటూ పెడుతున్నారు. జీవహింస వద్దు అని చెప్పినా మా కులంలో బాగోదు, మా ఇంటి చుట్టూ మమ్మల్ని అవమానంగా చూస్తారు అని అంటారు. కానీ మీరు తినకపోయినా ఎదుటివాడికి మాంసాహారం పెట్టడం వల్ల అది కూడా పాపమే.

అందుకే పత్రిగారు అన్నారు వండేవాడికి, వడ్డించేవాడికి, తినేవాడికి, చంపేవాడికి అందరికీ కర్మ అంటుకుంటుంది అని. మరి వాళ్ళు ఏమనుకుంటారో అని భయంతో అటువంటి ఆహారం పెడితే మళ్లీ కర్మలు పోగై అది జన్మకి, నరకానికి కారణం అవుతుంది.

పుణ్యం వల్ల జన్మ తీసుకుంటే, సాధన చేసిన తర్వాత మళ్లీ జన్మ తీసుకుంటే మీ జీవితంలో పురోగమనం ఉంటుంది. అంటే ఈ స్థితి కంటే తర్వాత జన్మలో ఇంకొంచెం మంచి జన్మ తీసుకుని ఇంకొంచెం సాధన చేసుకుని ఇంకా ఆత్మకు దగ్గర అవుతారు.

అలా కాకుండా వాళ్ళేమను కుంటారో, వీళ్ళేమనుకుంటారో అని

భయపడో, మొహమాటపడో  మీరు తినకపోయినా వాళ్ళకి ఆ పాపహారం పెడితే వాళ్ళేకాదు, మీరు కూడా ఆ పాప కర్మ అనుభవించవలసి వస్తుంది. అప్పుడు ఆ కర్మ వల్ల జన్మ తీసుకున్నా ఈ సాధన అనేది మళ్ళీ మీకు తెలుస్తుందో లేదో తెలియదు. మాయకి వశమై నరుడిగానే ఉంటారా? లేదా మాయని జయించి నారాయణుడిగా మిగిలిపోతారా? అన్నది మీరు జీవించే విధానాన్ని బట్టి ఉంటుంది.

సాధన వల్ల తప్పులూ, ఒప్పులూ తెలుస్తాయి. తప్పని తెలిసి కూడా తప్పు చేస్తే మరి శిక్ష తప్పదు, దానికి సిద్ధం అవ్వాలి. మరి మీరాబాయిని భర్త వద్దన్నా సరే కృష్ణుడ్ని ఆరాధించింది. ఆ ధ్యానంలో ఉండిపోయిందావిడ, అంతటి ధైర్యం రావాలి.

ఎక్కడో బంధం వల్ల, ఆ బంధం పోతుందేమో అని బాధతో సత్యాన్ని తెలుసుకుని కూడా నిర్భయంగా సత్యంలో జీవించలేకపోతున్నారు అంటే ఇంద్రియ నిగ్రహం లేకపోవడం వల్లే! అంటే మనసుకు బానిసలౌతున్నారు.

అందుకే రమణ భగవానుడు, శంకరాచార్యులు అంటారు. మీరు చేసే ప్రతీ పని విచారణ చేసుకోండి అని. ఈ రోజు ఈ పని చేశాను తప్పు చేశానా? ఒప్పు చేశానా? ప్రపంచం వైపు రావడానికి కావలసిన కర్మ చేశానా? లేదా పరమాత్మ వైపుకు వెళ్ళడానికి కర్మ చేశానా? ఎంత నిగ్రహాన్ని పాటిస్తున్నాను అని మీకు మీరే విచారణ చేసుకుంటూ తెలుసుకోవాలి.

సాధనకి జ్ఞానానికి తొలిమెట్టు ఇంద్రియ నిగ్రహమే. ఇంకా చూసుకుంటే ఆహారమే, ఆహారం సరిగ్గా తిన్నరోజున సరియైన మనసు, సరియైన ఆలోచనలతో, సరియైన జీవితం జీవిస్తారు.

# మానవజన్మ పరమార్థం

మానవ జన్మ యొక్క లక్ష్యం ఏమిటి? అసలు మానవ జన్మ ఎందుకు తీసుకున్నాం? అని ప్రశ్నించుకుంటే మనకి ఒక విషయం అర్థం అవుతుంది. మానవుడికి ప్రాపంచిక జీవితం, ఆధ్యాత్మిక జీవితం అని రెండు ఉంటాయి.

మానవుడు ప్రాపంచిక జీవితంలో ఉన్నప్పుడు తమోగుణం, రజోగుణం వలన కంటికి కనపడేవన్ని నిజం అనుకుని వాటిని అనుభవించాలని తాపత్రయ పడతాడు. ఎప్పుడైతే సాత్విక గుణంలోనికి వస్తాడో సత్యమంటే ఏంటో తెలుసుకొని, సత్యానికి దగ్గరవుతూ సృష్టి అంటే ఏమిటి? అది ఎలా ఏర్పడింది? ఎవరు సృష్టించారు? సృష్టి వెనుకాల ఎవరున్నారు? అనే విషయాలు తెలుసుకోవాలనే తపన మొదలవుతుంది. అప్పుడు తన జీవితంలోకి ఒక సద్గురువు వస్తే ఇవన్నీ తెలుసుకోగలను అని అర్థం చేసుకుంటాడు.

ప్రాపంచక జీవితంలో పరిమిత జ్ఞానంతో ఉంటారు కాబట్టి ప్రాపంచకమైన వాటి మీద ఆసక్తి చూపిస్తారు, అవి ఉంటే సంతోషంగా, సుఖంగా ఉండొచ్చు అనే అభిప్రాయంతో ఉంటారు.

కానీ అవి అన్నీ అశాశ్వతం అని తెలుసుకుంటారు. అంతేకాదు సంపూర్ణమైన జ్ఞానం పొందినప్పుడు మాత్రమే సంపూర్ణమైన సుఖం, శాంతి, ప్రేమ అనేవి దొరుకుతాయి అని తెలుసుకుంటారు. జీవితంలో జ్ఞానం ఒక సద్గురువు ద్వారానే పొందుతామని తెలుసుకుంటారు.

అలాగే ప్రాపంచకం జీవితం కంటే ఆధ్యాత్మిక జీవితం గొప్పదని, సృష్టి కంటే సృష్టికర్త గొప్పవాడు అని కూడా తెలుసుకోగలుగుతారు. అలాగే గురువు దగ్గరికి వచ్చిన కొంతమంది శిష్యులు ప్రాపంచిక లాభాలు ఆశించి వస్తారు, కొంతమంది మాత్రం ఆత్మజ్ఞానం పొందాలని గురువు దగ్గరికి చేరతారు.

అలా గురువు దగ్గరికి చేరినప్పుడు ఈ దుఃఖాలకి కారణం కూడా తెలుసుకుంటారు. ప్రాపంచక జీవితంలో ఎప్పుడూకూడా భయం, చింత,

ఉద్వేగం అనేవి ఉంటాయి. అందుచేత వాటిని కొంచం వివరించుకుందాం.

## భయం

మానవులకు రకరకాల భయం ఉంటాయి. ముఖ్యంగా ప్రతిఒక్కరికి చనిపోతానేమోనన్న భయం ఉంటుంది, నా దగ్గర ఉన్న ధనం పోతుందేమోననే భయం, పదవులు పోతాయని భయం, తాను సంపాదించిన డబ్బు పిల్లలు పాడు చేస్తారేమోననే భయం లాంటి రకరకాల భయాలు ఉంటాయి.

చిన్న పిల్లలకి ఒక రకం భయం, మధ్య వయసులో ఉన్నవారికి ఒక రకం భయం, ముసలి వయసులో ఒక రకమైన భయం ఉంటుంది. ఇలా రకరకాల భయాలు ఉంటాయి.

ఇటువంటి భయాలకు ముఖ్యకారణం ప్రాపంచక జీవితంలో ఏ సమస్య వచ్చినా విచారణ అనేది లేక విచారంతో ఉండటం. ఎప్పుడైతే విచారణ ఉంటుందో విచారం ఉండదు.

## చింత

మీ కూడా రాని వాటి కోసం తాపత్రయ పడటమే పెద్ద చింత, మీకు లేని వాటి కోసం ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటారు, ఎన్ని ఉన్నా ప్రక్కవాడికి మీకంటే ఏదైనా ఒక్క వస్తువు ఎక్కువ ఉంటే మీరు చింతలో కూరుపోతారు. అంటే ఉన్నదానితో తృప్తి లేని జీవితం ఎప్పుడూ చింతలోనే ఉంటుంది అని అర్థం చేసుకోవచ్చు. ప్రాపంచక జీవితంలో నాకు అన్నీ ఉన్నాయి, నేను బాగున్నాను, నేను తృప్తిగా ఉన్నాను అనే మాట ఎవరి నోట రాదు,ఇంకా ఉంటే బాగుండును అనుకుంటారు.

## ఉద్వేగం

ఏ పని మొదలు పెట్టినా సక్సెస్ అవుతానో, లేదో అనే ఉద్వేగం అంటే ఆందోళనలో ఉండటం.

ఈ మూడు కూడా ప్రాపంచిక జీవితంలో ఉంటాయి. ఎప్పుడైతే మీ జీవితంలోకి సద్గురువు వస్తాడో అప్పుడు ఈ భయాలు, చింతలు ఉద్వేగాలు అన్ని తాత్కాలిక మైనవేనని తెలుసుకుంటారు. ఎంత తాపత్రయపడ్డా, ఎంత భయంతో ఉన్నా, ఎంత చింతలో ఉన్నా నీ జీవితంలో జరిగేవన్నీ కూడా నీ కర్మానుసారమే జరుగుతాయని, చివరకు మరణం కూడా అంతేనని జ్ఞానం పొందితే తెలుసు కుంటారు. మీరు జన్మ తీసుకున్నప్పుడు ఎంతకాలం జీవించి ఉండాలో నిర్ణయించుకొని వస్తారు అని జ్ఞానం పొందాక అర్థం అవుతుంది.

ఈ ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చి కూడా ఇంకా మరణ భయం ఉంది అంటే గురువుగారు చెప్పిన జ్ఞానం నీకు సరిగా అవగాహన కాలేదు అని అర్థం. గురువు మన జీవితంలోకి ఎందుకు వస్తారు అంటే మరణ భయాన్ని పోగొట్టడానికే. గురువు చెప్పిన జ్ఞానాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకుంటే మరణ భయం, చింత ఉండవు.

మనకు ప్రాప్తంలో ఉన్నవే వస్తాయి కానీ, ప్రాప్తంలో లేనివి ఏవి రావు అని గురువు చెప్పినప్పుడు, ఏది రాకపోయినా "ఓ నేను పైనుంచి వచ్చేటప్పుడే దీన్ని నేను కావాలి అని అనుకోలేదు కాబట్టి నేను ఎంత ప్రయత్నించినా నాకు రాలేదు" అనుకుంటే చింత లేకుండా పోతుంది.

ఇంకా కొంతమంది ప్రతి దానికి ఆశ పడుతూ ఉంటారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఎందుకు నాకే వచ్చింది? ఎందుకు నాకే ఇలా అవుతుంది? అసలు నేను అనుకున్న పని అవుతుందా? లేదా? అనే సంశయంతో ఉంటారు. అలాంటి సంశయచిత్తునికే ఉద్వేగం ఎక్కువగా ఉంటుంది. కానీ జ్ఞానం పొందినవాడు ఆ పని అవ్వలేదు అంటే దాని కంటే మంచిది ఇంకొకటి ఉందేమో అని అనుకుంటాడు, సంశయం చెందడు.

ఆధ్యాత్మికతలోకి వచ్చినవాడు, ప్రాపంచిక జీవితంలో ఉన్న దుర్గుణాలు భయం, చింత, ఉద్వేగం ఇవన్నీ కూడా మానసికమైన రోగాలు అని, తన జీవితంలోకి గురువు వచ్చాక జ్ఞానం పొంది సత్యం ఏమిటో అవగతం

చేసుకుంటాడు.

అలా సత్యం అవగతమైనప్పుడు ఈ సృష్టి అంతా భగవంతుడిదే అని అర్థమైనప్పుడు, నాది అంటూ ఏది లేదు అని తెలుసుకున్నప్పుడు, ఏ విషయానికి భయపడడు, చింతించడు, ఉద్వేగ పడడు. ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చినప్పుడు ఏవైతే ప్రాపంచిక జీవితంలో కోరుకున్నావో అంటే సుఖంగా ఉండాలి, సంతోషంగా ఉండాలి, శాంతిగా ఉండాలి, నేను ఎవ్వరికీ లొంగ కూడదు, స్వతంత్రంగా ఉండాలి ఇలాంటి కోరికలు ఆధ్యాత్మిక జీవితంలో సాధిస్తావు.

గురువు నువ్వు దేహం కాదు ఆత్మవి అని చెపుతాడు. ఈ ఆత్మకి దేహం ఒక తొడుగు మాత్రమే, నువ్వు నీ శరీరానికి వస్త్రం ఎలా కప్పుకున్నావో అలానే ఆత్మకి పైన ఒక తొడుగే దేహం, ఆ దేహంతోనే అన్ని పనులు చేస్తుంది ఆత్మ. ఆత్మ నీకు వ్యక్తం అవ్వదు, ఆత్మ అవ్యక్తం అంటే కంటికి కనిపించదు, కనిపించని శక్తి అంటే కరెంట్ ఎలా కనిపించదో ఆత్మ కూడా అంతే.

నీలో ఉన్న అణువంత ఆత్మ నీ శరీరాన్ని నడిపిస్తుంది, బ్రహ్మాండం అంతా ఉన్న సర్వాత్మ ఈ సృష్టిని నడిపిస్తోంది అని నీ జీవితంలోకి గురువు వచ్చాక తెలుసుకొని నీ జీవితానికి ఒక అర్థం, పరమార్థం ఏమిటో తెలుసు కుంటావు.

ఎందుకు ఈ మానవ జన్మ అంటే "నిన్ను సృష్టించిన వాడిని, తెలుసుకోవడానికి అని తెలుసుకుంటావు". ఇది తెలుసుకుంటే మరుజన్మ ఉండదు. జన్మ వుంటే దుఖమే కదా!

చాలామంది ఏమని అనుకుంటారు అంటే నేను అనుభవించ డానికి ఈ భూమ్మీదకి వచ్చాను, అనుభవిస్తూ తెలుసుకోవడానికే వచ్చాను అని అనుకుంటారు. ఇప్పుడు గమనిస్తే ప్రపంచంలో చాలామంది అన్నీ అనుభవిస్తూ, కొన్ని పొందుతూ, కొన్ని పొందలేనప్పుడు ముసలి వయసు వచ్చాక ఒక మాట అంటారు "ఈ జీవితమంతా దుఃఖాలతో నిండి ఉంది, దుఃఖంతో కూడినదే

జీవితం ఇంకేమి కాదు" అంటారు. ఎందుకు అంటారు అంటే ఆనంద స్వరూపుడైన ఆ పరమాత్మ తన శరీరంలోనే ఉన్నాడు అని తెలియక.

ఇప్పుడు పత్రిగారు అందరికీ "ధ్యానం వల్ల జ్ఞానం, జ్ఞానం వల్ల మోక్షం" అని చెప్పారు. మోక్షము అంటే పూర్ణజ్ఞానం పొంది మరుజన్మ లేకుండా ఉండటం.

కానీ కొంతమంది ధ్యానము అంటే కోరికలు తీర్చుకోవడం కోసం అని, సంకల్పం పెట్టుకుని ధ్యానం చేస్తారు. గమనించండి కోరిక వల్ల దుఖం అని తెలియక ఏ కోరికైనా సాధనతో సాధించవచ్చు అనుకుంటున్నారు. కానీ మీ ధ్యానశక్తి అంతా ఆత్మజ్ఞానం పొందటానికే కానీ ప్రాపంచకమైన వాటికోసం కాదు.

ఆత్మజ్ఞానం పొందినప్పుడు "నాదంటూ ఏది లేదు, ఇదంతా పరమాత్మదే అని నీకు అర్థమైనప్పుడు నాకు ఈ జీవితం ఎందుకు ఇచ్చాడు అంటే నేను ఎవరో? నాకు ఈ జీవితం ఇచ్చిన వాడు ఎవరో? తెలుసుకోవడానికే ఈ జీవితం అని తెలుసుకుంటారు.

కానీ సాధకుడు ఎప్పుడూ కూడా మాయలో పడిపోతానేమో అని గమనించుకోవాలి. మాయలో పడితే ప్రపంచ సుఖాలలో పడి దుఃఖానికి లోనవుతాడు. ఈ మాయ యొక్క ఆట ఎప్పుడు ఆగుతుంది అంటే "నా జీవితంలో నేను సరైన సాధన చేసినప్పుడు, నేను సరైన జ్ఞానం పొందినప్పుడు. నేను పరమాత్మ జ్ఞానం పొందడానికే భూమి మీదకు వచ్చాను కాబట్టి నేను నిరంతర సాధన, నిరంతర జ్ఞానము పొందడానికే వచ్చాను అన్నది అర్థమైనప్పుడు నాకు సంపూర్ణమైన సుఖం, శాంతి వస్తుంది.

పరమాత్మ కోసం ధ్యానం చేసిన వాడు ఇహలోకంలోనే కాదు, పరలోకంలో కూడా ఆనందంగా జీవిస్తాడు చివరకు జన్మలేని స్థితికి చేరుకుంటాడు.

మానవులు లక్షల, కోట్ల సంవత్సరాలు రకరకాల జీవులుగా

భూమిమీద జన్మ తీసుకుని జన్మకి కారణం ఎవరో తెలుసుకోకుండా బ్రతికేస్తున్నారు. కానీ ఇప్పుడు  జన్మకి కారణం ఏమిటో తెలుసుకున్నారు.

మీరు జ్ఞానం పొందాలి అంటే మీరు ఎక్కువగా గురువు చెప్పే విషయాలు ఆచరిస్తూ ఉండాలి. సత్యం ఎప్పుడు మార్పు చెందదు, కానీ అది నాకు అవగతం కాలేదంటే అడ్డుగా ఉన్న నా ప్రవర్తనని ఎలా మార్చుకోవాలో అన్నది గురువు ద్వారా తెలుసుకుంటావు.

మీ సాధన ద్వారా అంతరంలోకి వెళితే ఆత్మానుభూతిని పొందుతారు, అలా ఆత్మానుభూతి పొందకపోతే మీకు ఆనందం అనేది ఉండదు. భీమవరంలో ప్రతినెలా 1,2,3 తారీఖులలో జరిగే ఆత్మజ్ఞాన శిక్షణా తరగతులు కానీ, ప్రతి రోజు ఉదయం జరిగే జూమ్ లో జరిగే సాధన కానీ, జ్ఞానం క్లాస్ లు కానీ ఇవి అన్ని సాధన పెంచుకోవడానికి,  ఆత్మానుభూతిని పొందటానికి. ఇలా తీవ్ర సాధన చేయడం వల్ల చివరకు మీ జీవితం యొక్క పరమార్థం తెలుసుకుంటారు.


**తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము**

website address :  www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps  Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download  చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ధ్యాన యజ్ఞంలో రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# పూర్ణ జ్ఞానం పొందే వరకు భూమిమీదకి రావలసిందే

సాధన చేస్తూ ఎన్ని తెలుసుకున్నా నేర్చుకోవాల్సిన జ్ఞానం ఇంకా ఉంది, పూర్ణ జ్ఞానం పొందే వరకు భూమిమీదకి రావలసిందే అని మీరు అర్థం చేసుకోవాలి.

ఈ జ్ఞానం అనేది అనంతం. అది ఊరికే మీ దగ్గరికి రాదు, ఎంతో ప్రయత్నం చేస్తేనే వస్తుంది. అందుకే వశిష్టుల వారు తీవ్రాతి తీవ్రమైన పురుష ప్రయత్నం వల్లే జీవుడు దేవుడుగా మారతాడు అని చెప్పడం జరిగింది.

అంటే సాధన తీవ్రాతి తీవ్రంగా చెయ్యాలి. గొప్పవాళ్ళందరూ కూడా అలా చేసిన వాళ్లే. దాన్నే పురుష ప్రయత్నం అంటారు.

ఈ విశ్వంలో అన్నిటికంటే గొప్పది జ్ఞానం పొందడమే. నేను జీవుడిని అని భావించినవాడు శివత్వంలో ఉండాలి, శివత్వం అంటే దైవంగా మారటం. అహం బ్రహ్మాస్మి అంటే నేనే దైవము అని తెలుసుకోవడం..

కానీ శారీరక, మానసిక, బుద్ధి పరమైన రకరకాల కోరికలతో జీవులమని అనుకుంటారు.

అలా నేను జీవుడిని అని భావించే మానవుడిని శివత్వంలో ఉంచడమే గొప్ప ప్రయత్నం, కానీ అది అంత తేలికేం కాదు. చాలామంది గురువుల దగ్గరికి వచ్చి మాకు ఈ కష్టాలు ఉన్నాయి, బాధలు ఉన్నాయని చెప్పినప్పుడు ఇవన్నీ నీ శరీరానికి, మనసుకే కానీ ఆత్మవైన నీకు సంబంధం లేదు అని గురువు చెపుతాడు.

ఆత్మకి జనన–మరణాలు, శోక–మోహాలు, ఆకలి–దప్పికలు లేవు అంటే ఆత్మ షడూర్మ రహితం అని సద్గురువు చెపుతారు. కానీ ఇవన్నీ తెలుసుకోవాలంటే ధ్యానం చేయ్యాలి, అప్పుడే ఆత్మ మార్గంలో మీరు పయనించ గలరు.

శిష్యుడు ఎంత గట్టిగా ప్రయత్నిస్తాడో అంత తొందరగా నేర్చుకుంటాడు. ఇలా తెలుసుకుంటున్నా, ప్రయత్నం చేసినా ప్రకృతి వశంలో ఉన్న మానవుడు ఒక పట్టాన బయట పడలేదు, కారణం మాయ.

చూడండి సంసార బాధ్యతలు ఉన్నప్పుడు తప్పదు కదండి అంటారు, ఉద్యోగం తప్పదు కదా అంటారు, అలాగే ప్రాపంచికానివి ఏవైనా ఉంటే వెళ్ళక తప్పదు కదండి అంటారు. అలా తప్పదు కదా అని అన్నారు అంటే మీరు ఇంకా మాయకు వశమై ఉన్నారని లెక్క. అందుకే మాయ యొక్క వలలో చిక్కుకొని ఉన్నారు అని మీరు అర్థం చేసుకుని పదే పదే గుర్తుంచు కుంటూ, సాధన తీవ్రంగా చేస్తూ "అహం బ్రహ్మాస్మి" అనే స్థితికి రావాలి.

అలాంటి తీవ్రమైన పురుష ప్రయత్నం వల్లే ఆ మాయని జయించడం సాధ్యం అంటారు మహాపురుషులు. కానీ తప్పదు కదా? అని మీరు ఎప్పుడైతే అన్నారో ఇక తప్పించుకోలేరు.

గురువు మీకు దైవానివని చెప్పాడు. కానీ ప్రాపంచిక జీవితంలో జీవించనప్పుడు ఈ మాయకు వశమై, బంధానికి వశమై తప్పించుకోలేకుండా ఉంటారు. అంటే అహం బ్రహ్మాస్మి అని తెలిసినా ఆ స్థితిలో మీరు ఉండలేరు. కానీ ఇది మహా పురుషుల సన్నిధిలో సాధ్యమవుతుంది అని చెప్పడం జరిగింది.

ఇప్పుడు మీరంతా జూమ్ లో పాల్గొంటున్నారు. చక్కగా ధ్యానం చేస్తున్నారు, చక్కగా జ్ఞానమూ వింటున్నారు. భీమవరం వచ్చినా సాధన చేస్తున్నారు, క్లాసులు వింటున్నారు, నోట్సులు వ్రాసుకుంటున్నారు. ఎందుకు అంటే మీరు ప్రయత్నిస్తున్నారు. అదే ఇంట్లో కూర్చుని ఇన్ని గంటలు సాధన చేయమంటే చేయగలరా? చేయలేరు కదా?

అంటే ఆ గురువు సన్నిధిలో ఏదైనా సాధ్యమవుతుంది అని మీకు అర్థమైనప్పుడు భీమవరం వచ్చి మూడు రోజులు అద్భుతంగా ఇన్ని గంటలు సాధన చేసినప్పుడు ఈ ప్రకృతి యొక్క మాయనుంచి మీరు బయట పడతారు.

రాఘవరావు గారి స్థాయికి, పత్రిగారి స్థాయికి వచ్చినప్పుడు ధ్యానం కోసం ఎక్కడికి పరుగులు పెట్టక్కర్లేదు, ఉన్నచోటే చేయగలరు. కానీ మాయని కూడా ఎదిరించగలిగే స్థితికి, మాయ నుంచి ప్రక్కకు రాగలిగే స్థితికి, ఇది మాయ అని అర్థమయిన స్థితికి వచ్చేవరకు మీరు గురువు సమక్షంలో, సత్పురుషుల సంరక్షణలో, సజ్జన సాంగత్యలో తప్పనిసరిగా పాల్గోవాలి. అలా

సజ్జన సాంగత్యంలో పాల్గొన్నప్పుడు మీరు సత్యానికి దగ్గర అవుతూ ఉంటారు.

మహాపురుషుల సాంగత్యంలో ఉన్నప్పుడు, ఆ సత్యం గురించి వివరణ అర్థమైనప్పుడు ఇంకొంచెం ఇంకొంచెం దగ్గరయ్యి పురుష ప్రయత్నం ఇంకా తీవ్రంగా చేస్తూ ఉంటారు. కొంతమంది మూర్ఖులు నాకు ఆపద వచ్చినా దైవం చూసుకుంటాడు, గురువు చూసుకుంటాడు అని అనుకుంటారు. గురువు మార్గం చెప్తాడు కానీ నీ కర్మల నుంచి నిన్ను విడుదల చేయడు.

నీ పురుష ప్రయత్నం తోటే నీ కర్మలనే కొలిమిలో నుంచి నువ్వు బయటికి రాగలవు. గురువే చూసుకుంటాడు, దైవమే చూసుకుంటాడు అనుకునే బద్ధకస్తులకి, సోమరిపోతులకి ఏనాటికీ సిద్ధి లభించదు అని మహాత్ములు ఎన్నో పుస్తకాలలో వ్రాశారు.

ముందు మీరు ప్రయత్నం చెయ్యండి తర్వాత భగవంతుడి కృప, గురువు కృప ఉంటుంది. మీరు పురుష ప్రయత్నమే చేయకపోతే వాళ్ళ కృప లభించదు, ఎన్నటికీ సిద్ధి రాదు.

అందుకే మనం ఎప్పుడూ కూడా సోమరిపోతులం కాకూడదు, అశ్రద్ధపరులం కాకూడదు. భగవానుడు భగవద్గీతలో శ్రద్ధవాన్ లభతే జ్ఞానం అన్నాడు అంటే శ్రద్ధ ఉన్నవాడికే జ్ఞానం వస్తుంది. అలాగే "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం" అన్నాడు.

ఈ రెండు విషయాలు మనం ఎప్పుడూ జాగ్రత్తగా గుర్తుంచుకుని శ్రద్ధగా సాధన చేస్తే జ్ఞానం వస్తుంది. ఆ జ్ఞానం వచ్చిన వాడు "అహం బ్రహ్మోస్మి" స్థితిలో ఉంటాడు. అలా ఉన్నవాడికి సంచితకర్మలు కరుగుతూ ఉంటాయి.

మరి ఈ విషయాన్ని గురువు ద్వారా విన్నాక గురువు చూసుకుంటాడు అని వదిలేయకూడదు. మీ ప్రయత్నాన్ని తీవ్రతరం చేసి శ్రద్ధగా సాధన చేసి జ్ఞానం పొందినప్పుడు ఆ గురువు మీకు ఇంకా ఇంకా జ్ఞానాన్ని అందించడానికి ప్రయత్నిస్తాడు.

ఎందుకు ప్రయత్నిస్తాడంటే? మానవులు మనసు స్థితిలో ఉంటారు కాబట్టి, మనసుకున్న సోమరితనం, అశ్రద్ధ అనే చెడ్డగుణాలు మీ దరి చేరకుండా

నిరంతర సాధన, నిరంతర బోధన, నిరంతరము జ్ఞాన పిపాస ఉండేటట్టు గురువు మిమ్మల్ని చూసుకుంటాడు.

ఇప్పుడు రాఘవరావు గారు రోజూ ధ్యానము, జ్ఞానము అంటూ మిమ్మల్ని ఆ గుహలోనే ఉంచి ఇంకా ముందుకి నడిపిస్తున్నారు. మరి అలాగే కూర్చోకుండా ఆయన అన్ని ఊర్లూ తిరిగి జూమ్‌లోకి, భీమవరంకి రాని వాళ్ళ దగ్గరికి నేను వెళ్తాను అని వెళ్తున్నారంటే! శిష్యుడి యొక్క ప్రయత్నం కంటే కూడా, శిష్యుడి గురించి గురువే ఎక్కువ ఎప్పుడూ ప్రయత్నిస్తాడు అన్నది అర్థం చేసుకోవాలి. అది శిష్యుడికి తెలియదు.

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే శిష్యుడు తనకోసం తాను ప్రయత్నిస్తాడు, గురువు శిష్యుల కోసం ప్రయత్నిస్తాడు. గురువు ఇంట్లో కూర్చుని చేసుకోవచ్చు కానీ దైవత్వం ఉన్నవాళ్ళు నిరంతరం అందరిని దైవత్వం వైపు నడిపిస్తారు.

అంటే కొంతమందికి ఏం చేయాలో తెలియదు. అలాంటి వాళ్ళ దగ్గరికి వెళ్లి నీ దుఃఖానికి కారణం వేరెవరో కాదు, నువ్వు గత జన్మలో చేసుకున్న కర్మల వల్లే వర్తమాన జన్మల్లో దుఃఖం ఉంది. ఆ దుఃఖాన్ని జీవితాంతం అనుభవించక్కర్లేదు, సాధన చేసి జ్ఞానం పొందినప్పుడు ఈ దుఃఖం పోతుంది అని ఒక్క మాట చెప్పడమే.

అందుకే అన్నారు ఈ భూమ్మీద అతి గొప్ప పని ఏదయ్యా అంటే ఈ మార్గంలో మనం పయనిస్తూ మిగతా వారిని పయనింప చేయడమే. జీవత్వం నుంచి శివత్వంలోకి తీసుకువెళ్ళడమే గొప్ప పని అని మన ఉపనిషత్తులు బోధిస్తున్నాయి.

అందుకే గురువు చూసుకుంటాడు అనుకుంటే ఏ ఆశయ సిద్ధి కోసం ప్రయత్నం చేస్తున్నారో ఆ సిద్ధి మీకు ఎప్పటికీ లభించదు. దీనికో చక్కని ఉపమానం చెప్పారు, అమృతం తాగకుండా అమృతాన్ని గ్లాసులో పట్టుకొని కూర్చుంటే నువ్వు ఎప్పటికీ అమరుడవు కాలేవు.

అలాగే గురువు సాధన చెప్పినప్పుడు అది చేస్తూ జ్ఞానం ఎలా

పొందాలో అలా పొందాలి. కొంతమంది చెప్తూ ఉంటారు, మేము పుస్తకాలు చదవమండి, మీరు చెప్పిన వీడియోలు వింటాము, మస్తకములో ఫీడ్ అయిపోతాయండి అని చెప్తూ ఉంటారు.

మీకు నిన్న, మొన్న జరిగినవే గుర్తుండవు. అలాంటిది సంవత్సరాలు, సంవత్సరాలు గురువు బోధించే విషయాలు ఎలా జ్ఞాపకం ఉంటాయి? అందుకే రాఘవరావు గారు ఎప్పుడూ నోట్సులు వ్రాయిస్తారు. కొంతమంది విమర్శిస్తారు, చిన్న పిల్లలతో వ్రాయించినట్టు వ్రాయిస్తారు అంటారు.

మీరు ఎదగాలని మీ నొసటన వ్రాసి ఉంటే ఈ జన్మకే ఎంతో ముందుకు వెళ్లొచ్చు అనేది తెలుసుకుంటారు. మరి అర్థం అవ్వట్లేదు అంటే ఇంకా చిట్ట చివరి స్థితికి వచ్చే పుణ్యం లేదు కాబట్టే విమర్శిస్తూ అక్కడే ఆగిపోతారు.

అది ఎవరికి వాళ్ళు తెలుసుకోవాల్సిన విషయం. కొంతమంది ఒక్క రోజు మన క్లాస్ కి వచ్చి కూడా అయ్య బాబోయ్ ఇంత గొప్ప విషయాలు వ్రాసుకోకపోతే  మర్చిపోతామేమో అని వ్రాసుకునే వాళ్ళూ ఉంటారు.

అలాగే సంవత్సరాల నుంచి ధ్యానం చేస్తూ ఇన్ని సంవత్సరాలు అయింది, ఇన్ని క్లాసులు చెప్తున్నాను అని అహంకారంతో ఏమీ వ్రాసుకోకుండా యాక్షన్ చేసేవాళ్ళూ ఉంటారు. ఈ జ్ఞాన మార్గంలో ఎవరి శ్రద్ధను బట్టి, ఎవరి ప్రయత్నాన్ని బట్టి వారికి ఫలితం వస్తుంది.

అందుకే వశిష్టుల వారు పురుష ప్రయత్నం లేనిదే ఏదీ పొందలేరు అన్నారు. మరి అహంకారం అడ్డు వచ్చి నేను వ్రాయడం ఏమిటి? నేను వినడం ఏమిటి? అని నువ్వు అనుకుంటే ఏదీ పొందలేవు.

సత్యం అన్నది ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా అర్థమైతే అవన్నీ క్రోడీకరించుకుని సత్యం ఎంత గొప్పదో నువ్వు తెలుసుకోవడానికే సజ్జన సాంగత్యం. అందుకే పత్రిగారు ఎప్పుడూ సజ్జన సాంగత్యం, స్వాధ్యాయం అని చెప్పేవారు అంటే సత్యం ఒక్కటే. కానీ వాళ్ళకి ఎంత అందిందో అది నువ్వు తెలుసుకుంటావు. నీకు ఎంత వస్తుందో, ఇంకొకడికి ఎంత వస్తే అక్కడ

ఎంతమంది కూర్చున్నారో అందరికీ సత్యం తెలుసు. కానీ ఒక్కొక్కడు, ఒక్కొక్క మార్గం గుండా చెప్పినప్పుడు నువ్వు తెలుసుకోవాల్సింది ఎక్కువ అవుతుంది.

నువ్వు ఒక్కడివే వింటే ఇప్పుడు గమనించండి. మీరు నెలలో ఎందరో క్లాసులు వింటూ ఉంటారు. విన్నప్పుడు మీకు కొంచెం తెలుస్తుంది. అదే భీమవరంలో మీరు పాల్గొన్నప్పుడు ఇంతమంది కలిపి సాధన చేసినప్పుడు అక్కడ అందరూ సామూహికంగా చేసినప్పుడు ఆ చైతన్య స్థితి వేరుగా ఉంటుంది. అందుకే చాలా మంది చెప్తారు. ఇక్కడ 10 గంటలు కూర్చున్నాం, ఇన్ని గంటలు కూర్చున్నాం, మొత్తం 30 గంటలు చేశాను అంటారు. ఎందుకు చేశారు?

వీళ్ళు సజ్జనులు ఇక్కడికి వచ్చిన వాళ్ళంతా సజ్జనులు, అందులో దుర్జనులు ఎవ్వరూ లేరు. మన ఇంట్లో అయినా ఉండొచ్చు, కానీ అక్కడ ధ్యానం దగ్గర అందరూ సజ్జనులు కూర్చుంటారు. ఎందుకు మీ ఇంట్లో ఉన్నా మీకే కాసేపు బయటకెళ్ళక ఇంట్లో ఉంటే అది చూడాలి, అది తినాలి, ఇది తినాలి ఈ పని చేయాలి, ఆ పని చేయాలని ప్రాపంచిక ఆలోచనలు ఇంట్లో ఉంటే రావచ్చు. కానీ అక్కడ ధ్యాన మందిరంలో కూర్చుని ధ్యానం చేసేవాళ్ళకి ప్రాపంచిక ఆలోచనలు రావు, ప్రాపంచిక కోరికలు ఉండవు, అందుకే అక్కడ కూర్చున్న వాళ్ళంతా సజ్జనులు.

మీరు ఇంటి దగ్గర నుంచి వచ్చేది పురుష ప్రయత్నం, మీ ప్రయత్నం అక్కడికి వచ్చాక ఆటోమేటిక్ గా కనెక్ట్ అయిపోతారు. అందుకే నువ్వు అమృతం దగ్గర కూర్చున్నప్పుడు, కూర్చున్నంత మాత్రాన అంటే దీని అర్థం ఇంకా తెలుసుకోవాలి. అంటే ధ్యానం తెలిసినంత మాత్రాన నీకు అమరత్వం సిద్ధించదు, తెలుసుకుంటే సిద్ధించదు, తెలుసుకోవడం అంటే ఎలా అంటే అమృతాన్ని ఎదురు పెట్టుకుని అమృతం తాగకపోతే మరి నీలో ఉన్న అంతర్యామిని తెలుసుకోలేవు.

నువ్వు ఎప్పుడు తెలుసుకోగలవు? ఆనందంఅంతా అంతర్యామి దగ్గరే ఉందని గురువు ద్వారా తెలుసుకున్నాక నీ పురుష ప్రయత్నం ద్వారా సాధన చేస్తే జ్ఞానం పొందితే నువ్వు అమరుడవుతావు. మరి ఇది రావాలి మన

అంతర్యామి మన ఆత్మ మనకు దర్శనం కావాలి, ఆత్మానుభూతి పొందాలి అని అనుకుంటే వివేక, వైరాగ్యాలనే వాటితో ప్రయత్నం చేయాలి ఊరికే చేస్తున్నాం అంటే కాదు.

బయట రెండు ఉన్నాయి. వివేకము, వైరాగ్యం. ఏ వివేకం ఉండాలి? నిత్య అనిత్య వస్తు వివేకం. నీకు కోరికలు ఎన్నో ఉండొచ్చు, ఆ కోరికలు ఏది అవసరం లేదు అనే వివేకం ఉండాలి, ఆ వివేకం లేనప్పుడు సాధన చేసినా ఫలితము లేదు. వైరాగ్యం అంటే ఈ శరీరం మీద, బంధం మీద అన్నిటి మీద ఇవన్నీ నశించేవే! ఏది శాశ్వతం కాదు అనే వైరాగ్యం. ఈ రెండు ఉండాలి.

నేను వెళ్ళినప్పుడు కూడా ఏది పట్టుకెళ్తానో దానికోసం నా ప్రయత్నం. పుట్టిన దగ్గర నుంచి ధ్యాన మార్గంలో వచ్చే వరకు మనకేం కోరుకోవాలో తెలియదు, కాని కోరుకున్నాను, అనుభవించాను. అందుచేత కొంతసేపు సంతోషపడటం, అవి మళ్ళా పోయినప్పుడు దుఃఖ పడడం జరుగుతుంది.

చూడండి పుట్టినప్పటినుంచి మరణం వరకు జరిగే మార్పులు జ్ఞాని ఎప్పుడు తెలుసుకుంటూ మరణించేలోగా నేను ఎంత సాధన చేయాలి? ఎంత జ్ఞానం పొందాలి? దానికోసం నేను ఎంత ప్రయత్నం చేయాలి? అని జ్ఞాని అనుకుంటాడు.

మరి అలా ఎప్పుడైతే సాధన చేసి జ్ఞానం పొందాలని తీవ్రాతి తీవ్రమైన కోరిక ఉన్నప్పుడు మీ ప్రయత్నం కూడా అంత తీవ్రంగానే ఉంటుంది. మరి అంత తీవ్రంగా ఉన్నప్పుడు సాధించకుండా ఉండలేరు. ఆ వివేకం, వైరాగ్యం రెండు ఉన్నప్పుడే మీరు ఆనందం పొందుతారు. అది మామూలు ఆనందం కాదు, అనంతానందం.

ఈ వివేక, వైరాగ్యాలతో ఆత్మానుభూతి పొందినప్పుడు అనంతమైన ఆనందం పొందుతాడు, అప్పుడు జీవుడు దేవుడుగా ఎదుగుతాడు. అది ఎప్పుడు కూడా శరీర భ్రాంతి, జీవ భ్రాంతి, మనో భ్రాంతి, జగత్ భ్రాంతి, ఇన్ని భ్రాంతులు పోగొడుతుంది

అహం బ్రహ్మాస్మి స్థితిలో ఉండాలి అంటే జ్ఞానం పెరగాలి. అలాంటి

తీవ్రాతి తీవ్రమైన కోరిక ఉంటే మీకు ఈ భ్రాంతులన్నీ తెలియకుండానే పోతాయి. నేను దైవాన్ని తెలుసుకోవాలి అనే కోరిక ఎంత తీవ్రంగా ఉంటుందో మీ నుంచి మీకు తెలియకుండానే ఈ శరీర భ్రాంతి, ప్రపంచ భ్రాంతి, ఈ భ్రాంతులన్నీ పోతాయి.

తానే దైవం అని తెలుసుకోవాలనే ప్రయత్నం ఉంటే ఎవ్వరూ వాళ్ళని ఆపలేరు. మరి అది అవ్వట్లేదు అంటే మీకు ఇంకా అంత తీవ్రమైన ప్రయత్నం లేదనే లెఖ్ఖ.

కొంతమంది చూడండి ఏదైనా అనుకున్నారంటే సాధించే వరకు నిద్రపోరు. వశిష్టుల వారు అన్నట్టు పురుష ప్రయత్నం అంత గట్టిగా ఉన్నప్పుడు మరి ఈ జన్మే చివరి జన్మ చేసుకోగలరు. అందుకే మహాత్ములు సత్యం చెప్పి, ఈ సత్యానికి చేరుకోవడానికి ఎన్ని అడ్డంకులు ఉన్నాయో చెప్తూ వాటిని ఎలా దాటవచ్చో కూడా వాళ్ళు మనకి నేర్పుతారు .

అందుకే ఇంత జ్ఞానం ఇన్ని రోజులు, ఇన్ని సంవత్సరాలు వింటున్నాం. ఇవన్నీ విచారణ చేసుకుంటే ఆత్మని చేరుకోవడానికి ఉన్న అడ్డులు ఏమిటో తొలగించుకుంటూ... ఎలా ముందుకు వెళ్ళాలో నేర్చుకుంటూ... తీవ్రమైన తపనతో, తీవ్రమైన ప్రయత్నంతో ముందుకు వెళ్ళాలి. మరి ఈ భూమి మీద అంతకంటే గొప్ప పని, గొప్ప కార్యం లేదు అని తెలుసుకోవాలి.

మీరు ధ్యాన మార్గంలోకి వచ్చిన కొత్తలో లాభాలే నేర్చుకుంటారు. ఎంతసేపు శరీర లాభాలు, మనసు లాభాలే నేర్చుకుంటారు. కానీ ఈరోజు ఆత్మని తెలుసుకోవడానికి, ఆత్మానుభూతిని పొందడానికి ఎంత ప్రయత్నం చేయాలో అన్నది తెలుసుకున్నాము.

ఎందుకంటే నేను ఎదుగుతున్నాను కాబట్టే శరీరము మనసు బుద్ధి స్థితి దాటి ఆత్మ స్థితిలో నేను ఎలాంటి అనుభూతి పొందాలి? ఎలాంటి అనుభవం పొందాలి? మరి ఎలాంటి ప్రయత్నం చేయాలి? అనేది నాకు తెలియబడుతుంది అంటే! ఖచ్చితంగా ఇది భగవంతుని కృపే అని ప్రతి ఒక్క జ్ఞాని అర్థం చేసుకుంటూ మీ ప్రయత్నాన్ని ఇంకా తీవ్రం చేసుకోవాలి.

# ధర్మజ్ఞుడు అంటే ఎవరు?

మరి ఈరోజు మనం ధర్మజ్ఞుడు అంటే ఎవరు? అనే విషయం తెలుసుకుందాం. మరి ధర్మానికి ఉన్న గొప్పతనం ఏమిటి? ధర్మం ఆచరించే వాడు ఎలా ఉండాలి? అని కొద్దిగా తెలుసుకుందాం.

ఎందుకంటే మానవుల్లో ధర్మం లేకపోతే సత్యాన్ని తెలుసుకోలేరు. అందుకనే ధర్మము, సత్యము రెండు ఒకదాని కొకటి అవినాభావ సంబంధం ఉంది. ఇప్పుడు ధ్యానం చేసి జ్ఞానం పొంది మోక్షం పొందాలి, ఆత్మ దర్శనం పొందాలి అనుకునే ప్రతీ ఒక్కరు కూడా ప్రాపంచిక జీవితంలో ధర్మాన్ని ఆచరించవలసిందే.

మరి ఈ ధర్మం ఎలా తెలుస్తుంది? ఈ ధర్మాన్ని ఆచరించాలంటే ఎలా? అనేది మనకి గురువు వచ్చాకే అర్థమవుతుంది.

మీకు భగవంతుడు ఉన్నాడు అని తెలుసు కానీ భగవంతుడు ఎక్కడున్నాడో తెలియదు. ఇప్పటివరకు భగవంతుడు విగ్రహాల్లో గుళ్ళల్లోనే వున్నాడని తీర్థయాత్రలు చేస్తూ, పుణ్యస్నానాలు చేస్తూ ఇవన్నీ మానవుడి యొక్క కర్తవ్యం అని అనుకున్నారు.

కానీ గురువు మీ జీవితాల్లోకి వచ్చాక సత్యాన్ని తెలుసుకోవడం, సత్యంలో జీవించడం, సత్యాన్నే పలకడం తెలుసుకున్నారు.

మరి సత్యం అంటే శాశ్వతంగా ఉండేది, ఆయనే భగవంతుడు అని తెలుసుకున్నాం. అందుకే ఇప్పుడు గురువులు కూడా స్వాధ్యాయం అని ఎంతో గట్టిగా చెప్తారు.

అహం బ్రహ్మాస్మి దగ్గర ఆగిపోతే అహంకారం, తత్వమసి అంటే అంతా ఒక్కటే అని తెలుసుకుంటే మిత్రత్వం, సర్వం ఖల్విదం బ్రహ్మ అని నువ్వు తెలుసుకుంటే అహంకారం పోయి నిరహంకారిగా మిగిలిపోతావు. అప్పుడు మీకు ఆత్మజ్ఞానం అబ్బుతుంది.

ఒక్క అహం బ్రహ్మాస్మి అని తెలుసుకుంటే నేనే దైవాన్ని, నేనే శాసించే వాడిని, నాకంటే గొప్పవాళ్ళు లేరు అని అహంకారం పెంచుకుంటారు. నేను

ఒక్కడినే కాదు సృష్టిలో ప్రతి జీవి దైవమే అని తెలుసుకున్నప్పుడు అందరితోటి మిత్రుల్లా ఉంటారు. కానీ వీడు శత్రువు వీడు మిత్రుడు అని ద్వైత భావాలు ఉండవు.

ఆ సృష్టిలో నేనున్నాను, దైవం సృష్టించిన సృష్టిలో నేనున్నాను అంటే దైవం దగ్గరే నేనున్నాను. దైవం నాకు ఎప్పుడూ దూరంగా లేదు, ఎక్కడ వెతకవలసిన పని లేదు, ఉన్నదంతా ఆత్మతత్వమే అని తెలుసుకుంటారు.

అందుకే వేదాధ్యయనం వల్ల సత్యం అవగాహన అవుతుంది అని మహాత్ములు చెప్పడానికి కారణం. ఏ వేదం తీసుకోండి. సృష్టిలో ఇవన్నీ అవగాహన చేసుకోవాలంటే నువ్వు దైవాన్ని ప్రసన్నుడిని చేసుకోవాలి. దైవం యొక్క ప్రసన్నత ఎప్పుడు వస్తుంది? అంటే నీ బుద్ధి దైవం మీద పెట్టినప్పుడు, దైవం ఎక్కడో లేడుగా ఆత్మగా నీలో ఉన్నాడు అని ఎరుక పరుస్తుంది నీ స్వాధ్యాయం.

మరి ఇంద్రియ నిగ్రహం ఎందుకు పాటించాలి? అంటే నీ ఇంద్రియాలకి నువ్వు బానిస అయినప్పుడు ఏదీ పొందలేవు. అందుకే ఇంద్రియ సంయమనం అని మనకు గురువులు చెప్తారు. ఎందుకంటే మరి ఈ పంచేంద్రియాలతో పాపాలు చేస్తారు అంటే ప్రతి ఇంద్రియము మీకు బాహ్యంగా ఉన్నాయి కాబట్టి ఈ ప్రపంచాన్ని చూస్తూ దానికోసం పాటుపడుతూ, అవి పొందడానికి అధర్మంగా కూడా ప్రవర్తిస్తారు.

మరి సత్యాన్ని తెలుసుకొని మోక్షాన్ని పొందాలనే కోరిక ఉన్నప్పుడు ఖచ్చితంగా ఇంద్రియ సంయమనం పాటించాలి. మరి ఇంద్రియ సంయమనం పాటిస్తే వచ్చేది మోక్షమే.

అంటే ఇప్పుడు మనిషికి మొట్ట మొదట శత్రువు మనసే. శత్రువు బాహ్య విషయంలో, బాహ్య ప్రపంచంలో తిరిగి ఒక్కొక్కసారి అవసరం లేనివి, అక్కర్లేనివి కోరుకుంటూ ఉంటుంది. మరి ఆ మనసును నిగ్రహించుకునే శక్తి నిత్య అనిత్య వస్తు వివేకం వున్నప్పుడు వస్తుంది.

కానీ ఆనందం అన్నది శాశ్వతం అది పరమాత్మ దగ్గరే ఉంది. ఆ

పరమాత్మ అణువంత ఆత్మగా నాలో ఉన్నాడు. మరి నేను ఆత్మని తెలుసుకుంటే నా జీవితంలో శాశ్వత ఆనంద స్థితి పొందుతాను అని ప్రతి జ్ఞాని తెలుసు కుంటాడు.

అందుకే ఫస్ట్ మానవ జన్మ కర్తవ్యం ఏమిటో తెలుసుకుంటే ధర్మపరమైన జీవితం అలవాటు చేసుకుంటాడు. ఎందుకంటే అధర్మం భగవంతుడికి ఇష్టం లేని పని అని ముందు తెలుసుకుంటాడు.

అందుకే వేదాధ్యయనం వల్ల భగవంతుడికి ఏది ఇష్టం? ఎలా ఉంటే నువ్వు సత్యంలో జీవించినట్టు. ఎలా మాట్లాడితే నువ్వు సత్య వాక్కులు మాట్లాడినట్టు అన్నది కూడా ఆ చదవడం వల్ల  అర్థమవుతుంది.

ఇంక రెండోది ఇంద్రియ సంయమనం. అంటే ఇంద్రియాలని అదుపులో పెట్టుకోవాలి, కారణం మొట్టమొదట మానవుడికి శత్రువుగా పని చేసేది మనసే కాబట్టి ముందు శత్రుత్వం నుంచి దాన్ని మిత్రుడిగా మార్చుకోవాలి. అంటే బాహ్య ప్రపంచంలో తిరిగే ఈ మనసుని అంతర్ ముఖం చేయాలి అంటే ఆత్మ వైపుకి తిప్పాలి.

ఇక వాక్కు. సత్యమే మాట్లాడాలి,  అబద్ధం ఆడాల్సిన పరిస్థితుల్లో కూడా సత్యమే మాట్లాడాలి. అందుకే చూడండి సత్య హరిశ్చంద్రుడ్ని  ఇప్పటికీ చెప్పుకుంటాం మనం. సత్యానికున్న శక్తి అది. మన నోటి వెంట ఎప్పుడు అసత్యమైన మాటలు రాకూడదు. అవతలవాడు మిత్రుడు శత్రువు అవుతాడు అని తెలిసినా సరే సత్యవాక్ పరిపాలన ఉండాలి. మనం మాత్రం ఎప్పుడూ సత్య వాక్కులనే పలకాలి, అసత్యం మన నోటి వెంట రాకూడదు.

మరి కోపం :- చీటికి మాటికి కోపం ఎందుకు వస్తుంది? అంటే వాడు వేరు, వీడు వేరు అనే భావమే  కోపానికి కారణం. అందరూ ఆత్మలే అన్నప్పుడు ఎవ్వరి మీద కోపమే ఉండదు.

మరి కోరికలు:- పుట్టినప్పుడు అన్నీ అశాశ్వతం. అని మీరు ఎప్పుడైతే అనుకుంటారో ఆ కోరిక కూడా అక్కడ ఆగిపోతుంది.

ఎందుకంటే ఈ ప్రాపంచిక కోరికల కంటే కూడా పరమాత్మ దగ్గర

ఉన్న ఆనందం గొప్పది. ఇవన్నీ అల్పమైన సంతోషాలను ఇస్తాయి, అని మనం ఎప్పటికప్పుడు ఎరుకతో ఉండి గమనించగలగాలి.

ఇక ఆకలిని కూడా అదుపులో ఉంచుకోవాలి అలా ఆకలేస్తుందని తింటూ, బాగున్నదని తింటూ ఉంటే సాధనకి శరీరం ఎప్పుడూ సహకరించదు.

అందుకే పత్రిగారు చెప్తూ ఉండేవారు నీకు నాలుగు ఇడ్లీ ఆకలి ఉంటే మూడు ఇడ్లీ తిన్నప్పుడు నువ్వు సాధన చక్కగా చేస్తావు, ఆరు ఇడ్లీ తిన్నావంటే నువ్వు సాధన చేయలేవు. అందుకే ఆకలిని కూడా అదుపులో పెట్టుకోవాలి.

జననేంద్రియాలు ఎప్పుడూ ఉద్రేక పరుస్తూ ఉంటాయి. అవి అనిత్యమైన సుఖం ఇస్తాయి. పశుజన్మలో కూడా నేను ఈ సుఖాలకు బానిసనై ఉన్నాను, ఇప్పుడు నేను పశుపతిగా మారాలి కాబట్టి ఆ ఉద్రేకాలను కూడా నేను అదుపులో పెట్టుకోవాలి అని తెలుసుకోవాలి.

వీటన్నిటికి నేను బానిసనైపోతే నాకు మోక్షం రాదు, నేను ధర్మాన్ని తప్పిన వాడినవుతాను. కాబట్టి భూమిమీదకు వెళ్ళాక ఒక జన్మ కూడా నేను వృధా చేయకుండా ఉంటాను.

ఆ భగవంతుడి దగ్గర నిర్ణయం తీసుకుని భూమ్మీదకు వచ్చి ఆ మాయకి వశమై మరిచిపోయి ప్రపంచంలో అంతా శాశ్వతం అనుకుంటూ గురువు చెప్పినట్టు నడుచుకోక ఇంద్రియాలకి బానిసలమై కర్మలు చేస్తున్నారు.

ఇచ్చిన మాటని నిలబెట్టుకోని వాళ్ళని ధర్మజ్ఞులు అనరు. ఇక్కడ ఇచ్చిన మాట ప్రకారం భూమ్మీదకు వచ్చి మర్చిపోవచ్చు. కానీ గురువు వచ్చాక ఆ మాయ అనే తెరని తొలగించుకోవడానికి ప్రయత్నించాలి. గురువు వచ్చాక నువ్వు శరీరం కాదు, ఆత్మవి. ఆత్మవైన నువ్వు ఈ శరీరాన్ని ఎందుకు ధరించావు? అంటే సాధన కోసం.

నువ్వు ధరించిన శరీరం సాధనకే, ఇది మర్చిపోయి వేదనలో ఉన్నావు. నీ వేదన పోవాలంటే మళ్ళీ సాధనలోకే రావాలి. నీకు శాశ్వతానందం కావాలి అంటే సాధన ఉండాలి. అందుకే గీతలో కృష్ణ భగవానుడు శ్రద్ధవాన్

లభతే జ్ఞానం అని చెప్పాడు.

అంటే గురువు మాటల్ని నువ్వు శ్రద్ధతో విని, శ్రద్ధతో ఆచరించి, శ్రద్ధతో సాధన చేసి, శ్రద్ధతో స్వాధ్యాయం చేస్తే నీకు ఇదే చివరి జన్మ అవుతుంది. సృష్టికర్తని వదిలి సృష్టి కోసం ధ్యానం చేస్తే వాడు దుఃఖం పాలవుతాడు.

కానీ మన వేదాలు చెప్తున్నా, మహర్షులు చెప్తున్నా, గురువు చెప్తున్నా ప్రాపంచిక లాభాల కోసం ధ్యానం చేస్తే వాడి సాధన వ్యర్థమైపోతుంది. మోక్షం కోసం చేయాల్సిన సాధన భోగం కోసం చేస్తే వ్యర్థం కాదా? యోగం ఎప్పుడు భోగం కోసం అనుకునేవాడు గురువుని లెక్క చేయడు.

గత జన్మ యొక్క పుణ్య కర్మల వల్ల ఎన్ని రావాలో అన్ని మనకు వచ్చాయి. రోజు వింటున్న ఈ క్లాసులన్నీ మననమే, అంటే మర్చిపోయిన వన్నీ మళ్ళా మననం చేసుకుంటూ మాయకి వశమవ్వకుండా ఉండడానికే ఇన్ని క్లాసులు, ఇన్ని రోజులు వినడం.

మరి సంయమనం పాటించకుండా ఉద్రేకాలను ఆపుకోకపోతే నీకు మోక్షం ఎప్పుడు? ఏ ఒక్క ఇంద్రియానికి నువ్వు బానిసవైనా నువ్వు మోక్షానికి దూరంగా వెళ్ళిపోతావు, సత్యానికి దూరం అవుతావు.

అందుకే గురువులు ఆహారం విషయంలో జాగ్రత్తలు చెప్తారు. వాక్కుని కూడా ఎంతో జాగ్రత్తగా ఉపయోగించమని చెప్తారు. అందుకే ఉద్వేగ పూరితంగా ఎప్పుడు మాట్లాడవద్దు. ఆ వాక్కుని అదుపులో ఉంచుకున్నవాడు శక్తిని చాలా ఆదా చేస్తాడు.

మరి ఈ విధంగా వాక్కుని అదుపులో పెట్టుకుంటూ కర్మలు తగ్గించుకోవాలి. ఎందుకు అంటే ఒక్క కర్మ ఉన్నా మళ్లా జన్మ వస్తుంది. మళ్లా జన్మ అంటూ వస్తే ఈ సాధనకి అనుకూలమైంది వస్తుందో! రాదో! మళ్ళీ సద్గురువు దొరుకుతాడో! లేదో! తెలియదు.

ధర్మజ్ఞుడు ఎవరు? అని ఎంతో చక్కగా చెప్పాడు. వేదాధ్యయనం చేసేవాడికి సత్యం అవగతం అవుతుంది, సత్యం అంటే ఏంటో తెలుస్తుంది. ఎందుకంటే వేదాంతం అంతా కూడా పరమాత్మ గురించి, ఉపనిషత్తులన్నీ

కూడా పరమాత్మ గురించే చెప్పాయి.

ఇక్కడ మహాత్ములు ఒక మాట అంటారు. **"అమృతం త్రాగిన వాళ్ళు చిల్లర దేవుళ్ళయ్యారు. హాలాహలం త్రాగినవాడు పరమాత్మ అయ్యారు"** అని.

అంటే కష్టాలు వచ్చినా తట్టుకోవాలి, తట్టుకుంటూ ఇంకా ముందుకి సాగితే నువ్వు కూడా కో క్రియేటర్ అయితే నువ్వు కూడా పరమాత్మ స్థాయికి ఎదిగినట్టే అని మనకి చెప్పడం జరిగింది.

ధర్మరాజుకి కూడా కష్టాలు వచ్చాయి, కానీ అవి కూడా ఓర్పుతో తట్టుకున్నాడు. ధర్మరాజుకి తెలుసు, నేను ఎదగడానికి ఇవన్నీ మెట్లే అని. అందుకే ఓపికతో ఉన్నాడు.

మీరు కూడా సత్యము, ధర్మము ఆచరించాలంటే సత్యం గురించి తెలుసుకోవాలి. ఆత్మే సత్యం, సృష్టి అంతా పరమాత్మ మయమే! సర్వం ఖల్విదం బ్రహ్మ. ఈ సత్యం తెలిసింది కానీ మనసు ప్రపంచంలోకి వెళ్ళిన మూలాన ధర్మాన్ని కొద్ది కొద్దిగా మీరు తప్పుతూ ఉంటారు అప్పుడప్పుడు. ఎవరికి వాళ్ళే ఏ విషయంలో నేను ధర్మం తప్పుతున్నాను అని విచారణ చేసుకోవాలి.

అందుకే ఇప్పుడు భూమిమీద ధర్మజ్ఞుడు ఎవరు? అంటే సత్యాన్ని తెలుసుకున్నవాడు, సత్యంలో జీవించేవాడు, సత్యవాక్కును పరిపాలించేవాడు, ఇంద్రియ సంయమనం ఉన్నవాడు. మరి బ్రహ్మజ్ఞానం వస్తే కానీ మనకి మోక్షం లేదు.

మరి బ్రహ్మజ్ఞానం పొందాలి అంటే మనసు, వాక్కు, కామేంద్రియాల్ని అదుపులో పెట్టుకోవాలి. అప్పుడే నీకు బ్రహ్మజ్ఞానం వస్తుంది. నీ దృష్టి వాటి మీద ఉంటే బ్రహ్మజ్ఞానం ఎట్లా వస్తుంది? బ్రహ్మజ్ఞానం వస్తే కానీ మోక్షం కలగదు. పరమాత్మ దర్శనం కాదు.

అందుకే భూమ్మీద సాధన చేసేవాడు, ఇవన్నీ పాటించేవాడు, జ్ఞానం పొందినవాడు మోక్షానికి అర్హుడు అవుతాడు, భగవంతుడిగా మారడానికి అర్హుడు అవుతాడు. ఎప్పుడైనా మానవ జన్మ తీసుకున్నాక గురువు వచ్చినా సరే మీరు ధ్యానం చేయకపోతే మీరు కూడా అధర్మంలో నడిచినట్టే.

ఎప్పుడైతే సాధన చేస్తారో మానవ జన్మ యొక్క కారణం ఏంటో తెలుస్తుంది. మీరు ఈ మానవ జన్మ ఎందుకు పొందుతారు అంటే చివరి జన్మ చేసుకోవడానికి. భగవంతుని తెలుసుకునే ఏకైక జన్మని తెలుసుకున్న మీరు సాధనలో ఉండాలి, జ్ఞానం పెంచుకోవాలి, మోక్షానికి చేరుకోవాలి.

ఆ జ్ఞానం ఎలా వస్తుంది? అంటే మీ దృష్టి, మీ సాధన, మీ సాధ్యాయం అన్నీ కూడా పరమాత్మ మీద ఉండాలి. నువ్వు ఏ పని చేసినా లోక కళ్యాణకరమైన పనులే అయినప్పుడు నీ దృష్టి పరమాత్మ మీదే ఉన్నట్టు. నీ గురించి నువ్వు చేస్తే కాదు, అందరి కోసం చేసేదే లోక కళ్యాణకరమైన పని. వాళ్ళే ధర్మాన్ని ఆచరించగలరు.

భగవంతుడు వాళ్ళ వెనకాల వుండి వాళ్ళకి అనంతమైన శక్తినిస్తాడు. అందుకే ధర్మజ్ఞుడు ఎవరయ్యా అంటే ఈ ఈ భూమ్మీద సత్యం తెలుసుకున్న వాడు, సాధన చేసినవాడు, జ్ఞానాన్ని పొందినవాడు, మోక్షం కోసం ప్రయత్నించి మోక్షాన్ని పొందినవాడు, బ్రహ్మజ్ఞానం పొందినవాడు వీరే ధర్మజ్ఞుడు, మిగతా వాళ్ళు కాదు. భగవంతుడు దృష్టిలో అందరూ అయిపోరు.

ఎన్నో పరీక్షలు ఉంటాయి. తట్టుకుంటూ ఉంటారు. ధ్యానంలోకి రావడం గొప్ప కాదు వచ్చి నిలబడగలగడం గొప్ప. వచ్చి భగవంతుడు పరీక్షలకు తట్టుకోవడం గొప్ప. ఇవన్నీ ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఎదగాలి. అందుకే పత్రిగారు ముందే సహనమే ప్రగతి అని నేర్పించారు. ఎందుకంటే భరించలేని కష్టాలు వస్తాయి. కానీ భరించాలి. ఇదే మన జీవితంలో హాలాహలం. అది కూడా పరమాత్మ స్థాయికి ఎదిగినప్పుడు హలా హలం లాంటి కష్టాలను కూడా తట్టుకోగలగాలి.

అందుకే ఎందుకోసం మానవ జన్మ తీసుకున్నామో ఆ కారణం ఏంటో మనం ఇక్కడికి వచ్చాక తెలిసింది కాబట్టి దానికోసమే మన జీవితాన్ని వెచ్చించాలి. అలా వెచ్చించినవాడే భూమ్మీద ధర్మజ్ఞుడు అని అంటారు.

# మనస్సు ఎందుకు ఇవ్వబడింది?

ప్రతి వాళ్ళకి మొట్టమొదటిగా నేను ఏ పనీ చేయలేనేమో అనే ఒక భయం వస్తూ ఉంటుంది.  భయం ఎందుకు అంటే? మానవుడికి మనసు ఇవ్వబడింది. చూడండి ఏ జీవికి లేని మనసు మానవుడికి ఉంది. మనసు మూలానే ముందుగా ఏ పని చేయాలన్నా భయపడుతూ ఉంటాడు.

మరి మానవుడికే మనసు ఎందుకు ఇవ్వబడింది? అని మనం ఆలోచిస్తే నిజంగా స్పిరిచ్యువాలిటీ అంటే తెలిసున్న విషయాల కంటే తెలియని విషయాలే మనం ఎక్కువగా నేర్చుకుంటూ ఉంటాం, గమనిస్తూ ఉంటాం, విచారణ చేస్తూ ఉంటాం, విశ్లేషణ చేస్తూ ఉంటాం.

అలా చేస్తూ ఉన్నప్పుడు మనకి అర్థమవుతుంది సృష్టిలో ఏ జీవి అయినా తనకి నిర్దేశించినవి మాత్రమే చేస్తుంది. అంటే ఏ ఆహారం ఇస్తే ఆ ఆహారమే తింటుంది. ఇంక అంతకంటే వేరేగా రుచులు అడగదు. నాకు ఇలా కావాలి, అలా కావాలి, ఈ రుచి ఉండాలి నాకు ఇదంటే ఇష్టం, అదంటే ఇష్టం అని అనదు. అవి తింటాయి, రమిస్తాయి పిల్లల్ని కంటాయి అంతే!

మరి మానవునకు మనసు ఇవ్వబడిన మూలాన ఆ మనసుతో అవసరమైనవీ చేస్తాడు, అనవసరమైనవీ చేస్తాడు. కానీ  మానవుడికే మనసు ఎందుకు ఇవ్వబడింది అంటే!

84 లక్షల జీవరాసులుగా ఆత్మ జన్మలు తీసుకుని ఎన్నో పాఠాలు నేర్చుకుంటూ  మానవజన్మలోకి ప్రవేశించినప్పుడు తానే భగవంతుడు అని తెలుసుకుంటేనే ఆ ఆత్మకి విముక్తి. అందుకే మానవునకు మనస్సు ఇవ్వబడింది.

అయితే ఇక్కడ చిట్ట చివరిగా మానవ జన్మలో ప్రవేశిస్తారు. ఈ మానవజన్మలలోనే సృష్టిలోని  అన్ని విషయాలూ నేర్చుకోవాలి, అన్నిరకాల అనుభవాలు పొందాలి. కాని మిగతా జీవరాశులకి సృష్టి గురించి, సృష్టికర్త గురించి ఆలోచించవలసిన అవసరం లేదు.

చివరగా మానవ జన్మకి వచ్చేటప్పటికి ఈ సమస్యలు ఏంటి? ఈ సృష్టి ఏమిటి? సృష్టికర్త ఏమిటి? అని ప్రతిదాన్ని విచారణ చేసుకుంటూ గమనిస్తూ

తెలుసుకుని, నేర్చుకునే  మనస్సు మానవుడికి ఇవ్వబడింది.

ఇప్పుడు మనం ఏదైనా ఒక వస్తువు చూసాం. చూసినప్పుడు దీని క్వాలిటీ ఏంటి? దీని రంగు ఏంటి? దీని రుచి ఏంటి? ఇది ఎందుకు ఇలా ఉంది? అని మనస్సు ఉన్న మూలాన విచారణ చేసి తెలుసుకుంటారు. అందుకే కొన్ని విషయాల్లో దుఃఖం ఉంటుంది, కొన్ని విషయాల్లో సంతోషం వస్తుంది. మానవజన్మలోకి వచ్చాక ఈ దుఃఖం, ఈ సంతోషము, సమస్యా ఎందుకు వచ్చింది? అన్నవి  తెలుసుకుంటారు. మానవుడు మనసుతో ప్రతీదాన్ని గమనిస్తాడు.

కానీ ఏ జంతువు గుడికి వెళ్లి నన్ను యజమాని కొట్టాడు యజమానిని శిక్షించు, మనసు మార్చు అని ఏ ఎద్దు కానీ, ఏ ఆవు కానీ ప్రార్థించదు. అవి ప్రకృతి సహజంగా జీవిస్తాయి.

కానీ మనసున్న మానవుడు అలాకాదు, కొత్త కొత్తగా నేర్చుకుంటాడు. నేర్చుకోలేని విషయాలన్నీ కూడా ఈ మానవ జన్మలో నేర్చుకుంటాడు.  కానీ ఈ మానవుడు ఆ మనసుని సద్వినియోగం కంటే దుర్వినియోగమే ఎక్కువ చేస్తున్నాడు.

కానీ  భగవంతుడు కొన్ని ధర్మాలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఎందరో ఋషులు, ఎన్నో ధర్మాలు వ్రాసి పెట్టారు. నాలుగు యుగాలకి నలుగురు మహాత్ములు ఈ ధర్మాలను వ్రాయడం జరిగింది. మరి ఇప్పుడు శంకులితుడి ధర్మం జరుగుతోంది. అయితే ఈ మనస్సుతో అవన్నీ అధ్యయనం చేసి ఎలా ఉంటే ధర్మాన్ని కాపాడతాం? ఎలా ఉంటే ధర్మానికి నష్టం కలిగిస్తాం? అన్నది తెలుసుకోవాలి.

అధర్మంలో ఉంటే సృష్టికి నష్టం, మనుషులకు నష్టం. ధర్మంగా ఉంటే నువ్వు దైవంగా ఎదగగలవు అని ఎన్నో ధర్మశాస్త్రాల్లో తెలియపరచడం జరిగింది. అంటే జంతువులకు గ్రహించే మేధస్సు లేదు, చదివే బుద్ధి, మనసు లేదు. మానవుడికి మనసు, బుద్దే కాదు భగవంతుడిగా ఎదగగలిగే అవకాశం కూడా ఇవ్వబడింది

అంటే మానవ జన్మ తర్వాత ఇంక ఏ రకమైన జన్మలు ఇవ్వబడలేదు.

అందుకే భూమిమీద జరుగుతున్నవన్నీ గ్రహించగలిగే శక్తి మానవునకు ఇవ్వబడింది.

మానవునకు ఉన్న మనస్సు వల్ల ఎన్నో విషయాలు గ్రహిస్తారు, కొన్ని ఆచరిస్తారు, కొన్ని వదిలేస్తారు. ఎందుకంటే శాస్త్రాల ద్వారా ధర్మం ఏమిటి? అధర్మం ఏమీటి? తెలియచేయబడింది. మరి ధర్మాన్ని ఆచరించిన మానవుడు సంతోషంగా జీవిస్తాడు. సత్యాన్ని తెలుసుకున్న మానవుడు ఆనందంగా జీవిస్తాడు.

ధర్మం ఒకటే తెలుసుకుంటే సరిపోదు. సత్యం, ధర్మం రెండు మానవుడికి రెండు చేతులు లాంటివి. ఎందుకు? అంటే మానవజన్మ లోనే సత్యాన్ని అన్వేషించి, సత్యాన్ని తెలుసుకునేది. మరి సత్యం నీకు అర్థం కావాలి అంటే ధర్మంగా ఉన్న వాళ్ళకే తెలుస్తుంది, ధర్మంగా లేని వాడికి సత్యం తెలియదు.

అందుకే ముందు ధర్మాన్ని ఆచరించు అన్నారు. ముందు మానవ జన్మ ఉద్దేశం ఏమిటంటే సృష్టిలో ప్రతీ దాని గురించి తెలుసుకోగలగడం.

మానవుడికి మనసు, బుద్ధి ఇవ్వబడింది కాబట్టి, అన్నీ తెలుసు కుంటేనే మోక్షం. అందుచేత ప్రతీ ఒక్క విషయం నేర్చుకోవాల్సిందే.

అందుకే శ్రీ కృష్ణ భగవానుడు శ్రద్ధావాన్ లభతే జ్ఞానం అన్నాడు. నేర్చుకోవడంలో శ్రద్ధ ఉండాలి, ప్రతీది శ్రద్ధగా నేర్చుకోవాలి.

మరి సాత్విక గుణ శాకాహారం వల్ల సత్వగుణంలోకి వెళ్తారు? కారణం అపరాశక్తితో సస్యాలు పెరుగుతాయి అంటే పరమాత్మ శక్తితో పెరుగుతాయి. అందుకే వాటిలో సాత్విక గుణం పెరుగుతుంది. ఈ శక్తి ఎక్కువ శాకాహారంలో, కూరగాయల్లో ఎక్కువ ఉంటుంది.

మరి ఆ విధంగా అపరాశక్తితో పెరిగిన ఈ శాకాహారం యొక్క కూరగాయలు, పప్పు దినుసులు ఇవన్నీ తినడం వల్ల మానవుడికి శక్తి పెరిగి, దానికి తోడు భగవంతుడు ఇచ్చిన మనసు, బుద్ధి వల్ల ఎన్నో విషయాలు తెలుసుకుంటాడు.

కాని చాలామంది తినకూడని ఆహారం తిని ఆ మనసును మలినం చేసుకోవడం వల్ల అధర్మ మార్గంలో పయనిస్తున్నాడు. కానీ ఏ జీవికి లేని

మనసు మానవుడికి ఇవ్వబడింది అంటే ఈ మానవ జన్మను ఆఖరి జన్మ చేసుకోవడానికే.

మానవుడు ధర్మ మార్గంలో నడవడానికి ఎన్నో ధర్మ గ్రంథాలు ఉన్నాయి. సాత్వికమైన ఆహారం కూడా పుష్కలంగా ఏర్పాటు చేయబడింది.

కానీ ధ్యాన మార్గంలోకి వచ్చాక సత్యం అంటే ఏమిటో తెలుస్తుంది, అంటే భగవంతుడు అంటే ఏవరో! ఎక్కడ ఉంటాడో! ఎలా చేరుకోవాలో తెలుస్తుంది.

జ్ఞానం పొందినవాడే మోక్షం పొందగలడు అని గ్రహించిన రోజున ఈ ప్రాపంచిక భోగాల గురించి, ఈ ప్రపంచంలో ఉన్న బంధాల గురించి ఆలోచించడు. కానీ చిట్ట చివరి దశకు వచ్చినవాడు లక్ష్యం, గమ్యం మీద దృష్టి పెట్టగలడు.

అన్నిటికీ కారణం మనసే అని అమృత బిందోపనిషత్ చెబుతోంది. అంటే ఈ మనసే ప్రపంచం వైపు వెడితే కోరికలు పెంచుకుంటుంది. మనసు ఆత్మ వైపు తిరిగితే కోరికలు తగ్గించుకుని జ్ఞానం పొంది పరమాత్మ పొందుతుంది.

ఒక యోగి, జ్ఞాని మాత్రమే మనసు ఎందుకు ఇవ్వబడింది అన్నది తెలుసుకుంటాడు.

మానవుడికి మనసు ఎందుకు ఇవ్వబడింది అంటే తన చుట్టూఉన్న ప్రపంచాన్ని గమనిస్తూ అందులో నుంచి పొందాల్సిన జ్ఞానం పొందుతూ అంతరంలోకి మనసుని తిప్పి పరమాత్మ దర్శనం కోసం ప్రయత్నించడానికి.

అందుకే మానవుడికి మనసు ఇవ్వబడింది, భగవంతుడ్ని అన్వేషించాలి. జ్ఞానాన్ని పెంచుకోవాలి. నీ చుట్టూరు ప్రపంచాన్ని గమనించాలి. అందులోనుంచి జ్ఞానం పెంచుకుంటూ ఉండాలి. అంతరంలో తిరిగి భగవంతుని అన్వేషించడానికి.

ముఖ్యంగా బాహ్యంలో ధర్మాన్ని ఆచరించాలి. అంతరంలో సత్యాన్ని అన్వేషించితెలుసుకోవాలి. ఈ రెండిటి కోసమే మానవుడికి మనసు ఇవ్వబడింది.

# సంకల్పం శక్తివంతంగా ఉంచుకోవాలంటే?

మనము ఎన్నో వింటున్నాము, తెలుసుకుంటున్నాము, నేర్చుకుంటున్నాము. ఎంతో మంచిగా, గొప్పగా ఉండాలి అంటే ఆధ్యాత్మిక పరంగా ఎదగాలి. కాని అనుకున్న సంకల్పానికి దృఢత్వం రావట్లేదు. అంటే నేను ఎదగాలి, జ్ఞానం పొందాలి, ఆనందంగా ఉండాలి అనే సంకల్పమైతే ఉంటుంది. మరి ఈ సంకల్పం ఎందుకు నెరవేరట్లేదు?

పత్రిగారి దగ్గరికి వచ్చిన వాళ్ళందరికీ కూడా ధ్యానం వల్లే జ్ఞానం, జ్ఞానం వల్లే మోక్షం అనే మూడు ముక్కలు ఆయన దగ్గరికి వచ్చిన రోజే తెలుస్తాయి. మరి తెలుసున్నా కూడా చాలామంది ఎందుకు పేరు ప్రతిష్టల కోసం, శారీరక, మానసికమైన లాభాల కోసం ధ్యానం చేస్తున్నారు అంటే? ఖచ్చితంగా వాళ్ళ సంకల్పం శక్తివంతంగా లేదు అని మనం అర్థం చేసుకోవచ్చు.

ఎందుకు శక్తివంతంగా ఉండట్లేదు అని ఆలోచిస్తే! అందరికీ కూడా ప్రాపంచికంగా జీవించడం అలవాటై, ప్రాపంచిక భోగాలు మీద ఆసక్తి తగ్గక ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం పొందాలి, ఆత్మ దర్శనం కలగాలి అని గట్టిగా అనుకోలేకపోతున్నారు. ఎంతగా ప్రాపంచిక భోగాల మీద ఆసక్తి ఉంటుందో అంతగా ఆత్మ మీద శ్రద్ధ తగ్గి పోతుంది. అందుచేత ప్రాపంచిక అవసరాలు చూసుకుంటూ ఆత్మ పైన ఆసక్తి పెంచుకోవాలి.

గురువు ఎన్నో సార్లు చెప్పారు తాత్కాలిక సుఖాల కోసం, సంతోషాల కోసం మీ శక్తిని ఖర్చుపెడతున్నారు. ఇది కొంత తగ్గించుకుంటే శాశ్వతమైన ఆనందం పొందవచ్చు. కానీ ఇది వింటున్నప్పుడు కరెక్ట్ అనిపిస్తుంది. ఆచరణలోకి వచ్చేటప్పటికీ సమయాన్నంతా ప్రాపంచికానికే వినియోగిస్తున్నారు.

కొంతమందికి ఆరోగ్యంగా ఉంటే చాలు అనుకుంటారు. మరి కొంతమందికి వాళ్ళు అనుకున్న పదవి మీద కానీ, డబ్బు మీద కానీ, లేకపోతే పెత్తనం మీద కానీ విపరీతమైన కాంక్ష ఉంటుంది. మరి ఈ ప్రాపంచిక కోరికలు, ప్రాపంచిక కాంక్షలు ఎంతగా పెంచుకుంటారో అంతగా ఆత్మ మీద ఆసక్తి తగ్గిపోతుంది.

మహాత్ములందరూ  స్వతంత్ర జీవితం గడిపారు. అంటే వాళ్ళు అవసరాలకి పరిమితమయ్యారు.

మీరు  ఆనంద స్వరూపులై ఉండి ఆనందం కోసం వెతుక్కోవడం ఎందుకు అంటే? శరీరం, మనసుతో తాదాప్యం చెంది శరీర అవసరాలు, మనసు అవసరాలకు ప్రాముఖ్యం ఇవ్వడం వల్ల నాకు ఆనందం లేదు అంటున్నారు. అంటే మీరు ఏద్దైతే అయి ఉన్నారో అది మర్చిపోయారు. ఏది కాదో, ఏది లేదో, ఏది సత్యం కాదో, దాని వెనకాల పరిగెడుతున్నారు, కాని అది తెలుసుకోవడానికే ధ్యానం.

గురువులు పరమ సత్యాన్నీ చెప్పారు. ఎందుకు పరమ సత్యం అన్నారు? ఆత్మే భగవంతుడు కాబట్టి, అది పరమ సత్యం. వర్తమానంలో నీకు కనిపించింది తాత్కాలిక సత్యం అయితే ఎప్పుడూ శాశ్వతంగా ఉండేది పరమ సత్యం.

అలాగే ఈ శరీరం కానీ, మనసు కానీ తాత్కాలిక సత్యమే. అంటే ఆత్మ ఇందులో నివసించినంతసేపు ఈ శరీరము, మనసు ఉంటాయి. ఆత్మ లేకపోతే ఇవి నశిస్తాయి. ఈ తాత్కాలిక సత్యాన్నే శంకరాచార్యులు మిథ్య అన్నారు.

మిథ్య అంటే లేదని కాదు, నశించేది. రూపం ఉన్నది ఏద్దైనా నశించేదే అని ఒక జ్ఞాని తప్పకుండా తెలుసుకోవాలి. తెలుసుకున్నాక రూపాల వెంట పరిగెట్టకుండా, ఈ రూపాలను సృష్టించే ఆ సత్యం వెనకాల పడాలి. ఆ ఆనంద స్వరూపుడి వెనకాల పడాలి.

అంటే శరీరం ఇక్కడే ఉన్నా కోరికల వెనకాల పడకుండా  దృష్టి ఆత్మ వైపు ఉండాలి. అంటే ప్రాపంచికంలో నీ అవసరాలు తీర్చుకుంటూ నీ సాధన మీద, జ్ఞానం మీద దృష్టి పెడతావు, ఇంక దేని మీద దృష్టి పెట్టవు.

ఇప్పుడు అనుభవిస్తున్న ఈ తాత్కాలికమైన ఆనందాలన్నిటినీ కూడా ఎందుకు  త్యాగం చేస్తున్నావు అంటే శాశ్వతమైన ఆనందం కోసం. కోరిక ఎందుకు లేదు అంటే ఇంతకంటే గొప్ప కోరిక కోరుతున్నావు కాబట్టి. ఏద్దైతే సత్యమైనది ఉందో అది నువ్వు కావాలనుకుంటున్నావు కాబట్టి ఈ చిన్నవన్నీ

వదిలేస్తున్నావు.

ఇప్పుడు పైకి వెళ్ళడానికి మేడమెట్లు ఎక్కుతున్నావు. మరి ఒక్కొక్క మెట్టు పైకి వెళ్తున్నప్పుడు కింద మెట్లను వదులుతావు. ఎందుకు వదులుతావు. శాశ్వతమైనది పైన ఉంది కాబట్టి. మెట్లు నువ్వు ఉపయోగించు కుంటూ... వదిలావు. అది శాశ్వతంగా వదలడం కాదు. మళ్ళీ నువ్వు కిందకు దిగినప్పుడు ఉపయోగించుకుంటావు.

అలాగే ప్రాపంచిక అవసరాలు తీర్చుకుంటున్నారు కానీ వాటిని త్యాగం చేయట్లేదు. అందుకే ఏదీ వదలట్లేదు. కాని శాశ్వతమైన ఆనందం కోసం ప్రయత్నం చేస్తున్నప్పుడు ఈ తాత్కాలికమైన వాటి వెనకాల పడకూడదు.

ఎందుకు శాశ్వత ఆనంద స్వరూపులమైన మనము శాశ్వత దుఃఖ స్వరూపులుగా ఉంటున్నాం అంటే? ఆనంద స్వరూపులం అని కూడా మనకు తెలియనంత హీన స్థితిలో ఉన్నాము. అందుకే గురువు వచ్చి నువ్వు శరీరం కాదు, నువ్వు ఆత్మవి ఆనంద స్వరూపుడవి. అది బయట వెతకకు, నీలోనే ఉంది. అశాశ్వతమైన మనసు దాన్ని కప్పిన మూలానా శాశ్వతమైన ఆనందం నీవు పొందలేక పోతున్నావు అని చెబుతాడు.

అప్పుడు నీవు ఓ నేను తిరగవలసిన వైపు తిరగకుండా అక్కర్లేని వైపు తిరిగి నా మనసుని అశాంతి పాలు చేసుకున్నాను అని తెలుసుకుంటావు. గురువు వచ్చాక నువ్వు మానవుడవు కాదు మాధవుడివి అని తెలుసుకుంటావు.

నీకు వార్ధక్యం వచ్చి ఇంద్రియాల పటుత్వం తగ్గేలోగా నువ్వు శాశ్వత ఆనంద స్వరూపుడివి దైవానివి అని తెలుసుకో! నీ సంకల్పం నేను ఆనంద స్వరూపుడిని అని ఈ శరీరం వదిలేలోగా తెలుసుకోవాలి.

మరి సంకల్పం ఎంత దృఢమైనదైతే నీ ప్రయత్నం అంత గట్టిగా ఉంటుంది. ఆ సంకల్పం దృఢమైనది కానప్పుడు మీకు వికల్పాలే ఎదురవుతాయి.

ఊరికే క్లాసులో కూర్చున్నప్పుడు నేను ఆత్మని, ఆనంద స్వరూపుడిని అని అనుకుంటూ మళ్ళీ నువ్వు ప్రాపంచికం వెనకాల పడ్డావు అంటే నీకు శాశ్వత ఆనందానికి అర్థం తెలియలేదని అర్థం. నువ్వు జీవుడు అనుకుంటే కోరికలు, దేవుడు అనుకుంటే ఏ కోరిక లేదు.

ఆ దైవానివై ఉండి ప్రాపంచికం వైపు తిరిగి నీకున్న అనంతమైన శక్తిని పరిమితం చేసి ఆ పరిమితంలో నువ్వు కూరుకుపోయి నాకింకా డబ్బు కావాలి, నాకింకా అధికారం కావాలి, నాకింకా పెత్తనాలు కావాలి అని కోరుకుంటున్నావ్. ఆల్రెడీ ఏదైతే కోరుకున్నావో అవన్నీ నీ దగ్గరే ఉన్నాయి బయట ఎక్కడా లేవు. ఇక్కడ గమనించండి భగవంతుడి యొక్క మాయని దాటాలి అంటే మార్గం ఒక్క ధ్యానమే. మరి ప్రాపంచిక కోరికలు ఎంతగా ఉంటే నేను మాయకి అంతగా వశమవుతున్నాను అని తెలుసుకోవాలి.

వినడం తేలిక, అనడం తేలిక ఆచరణలో పెట్టడం చాలా కష్టం. అందుకే అంటారు ఏమీ కోరక్కర్లేదు. పత్రిగారు చాలా సందర్భాల్లో చెప్పేవారు ఏమి కోరవద్దు. నీలో ఉన్న అనంతమైన గనిని వెలికి తీసే మార్గమే ధ్యానం. ధ్యానం చెయ్ అన్నీ నీ దగ్గరికే వస్తాయి. చింతామణి నీ దగ్గరే ఉంది, చింతలు తీర్చే చింతామణి అది నువ్వై ఉండి నీ చింత ఎవరికి చెప్పుకుంటావు అంటారు.

ఎంత అద్భుతంగా చెప్పారండి గురువు. కానీ మీరు అర్థం చేసుకోవట్లేదు. అంటే మీ దృష్టి ఖచ్చితంగా రాయిని చూసి రత్నం అనుకునే స్థాయి నుంచి మీరే రత్నాలుగా మారే స్థాయి మీలో ఉంది. అది ధ్యాన శక్తి వల్ల కలుగుతుంది. మీరు ఒక్క కోరిక కోరినప్పుడు మీకేదైనా మనసులో నుంచి ఒక కోరిక ఉదయించి నప్పుడు కాసేపు ధ్యానం చేయండి.

అట్లాగే నీ హృదయాన్ని తెరవాలి అంటే దుష్ట ఆలోచనతో ఉన్న నువ్వు మంచి ఆలోచనలోకి మారాలి అంటే సాధన వల్ల, విచారణ వల్ల, వివేకం వల్ల నువ్వు గొప్పవాడివి కాగలవు.

నీ కోరిక ఎలాంటిది అనే విచారణ ఉండాలి. ఏది కోరుకోవాలో ఏది కోరుకోకూడదో తెలుసుకోవాలి. ఈరోజు నేను దరిద్రంగా ఉన్నాను, కోటీశ్వరుని అయిపోవాలి అంటే ఎలా? ముందు గత జన్మలో నేను చేసిన పుణ్యం ఇంతే ఉంది కాబట్టి నాకు ఇంతే వచ్చింది, ఈ జన్మలో నేను చేసుకుంటే పై జన్మకు రావచ్చు లేదా ఇప్పుడే నేను అవ్వాలి అంటే నేను సాధన తీవ్రం చేయాలి, దానం చెయ్యాలి.

నిజంగా సాధన తీవ్రంగా చేసినప్పుడు చక్రవర్తిని కావలసిన నేను

బిచ్చగాడి  వేషం వేసుకుని తిరుగుతున్నాను అని మీకే అనిపిస్తుంది. ఎందుకంటే ఆత్మవి నువ్వు అని గురువు చెప్పినప్పుడు నేను ఆనంద స్వరూపుడినే కానీ బిచ్చగాడిని కాను అని ఎవరికి వాళ్ళు తెలుసుకోవాలి.

అదేంటో నేను తెలుసుకోవాలి అనే దృఢ సంకల్పం నీలో ఉంటే ఖచ్చితంగా ఈ జన్మలోనే సాధించగలవు.

సాధించలేకపోవడానికి కారణం ప్రపంచం మీద ఆసక్తి, ప్రాపంచిక కోరికల మీద ఆసక్తి. మరి ఆసక్తి ఎంతగా ఉంటుందో అంత బలహీనులు అవుతారు.  అలా మనోస్థితిలో ఉన్న వ్యక్తులయొక్క సంకల్పం బలహీనంగా ఉంటుంది. మనోశక్తి తగ్గించుకునేకొద్దీ వారి సంకల్పం బలంగా ఉంటుంది, అంటే వారి సంకల్పం శక్తివంతంగా ఉంటుంది. అప్పుడు వారు అనుకున్నవి ఏదైనా సాధించగలుగుతారు.  దానికి తగ్గ విశేషమైన కృషి చేయగలుగుతారు చివరకు సాధిస్తారు.

కారణం మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గే కొద్దీ శరీరంలో ఉన్న ఆత్మ యొక్క ప్రాముఖ్యం అపారంగా పెరుగుతుంది అందుచేత అనుకున్నది అంటే సంకల్పించింది ఏదైనా సాధించగలుగుతారు.

అందుచేత మీ సంకల్పం శక్తివంతంగా ఉండాలంటే మీరు “శ్వాస మీద ధ్యాస” ఉంచి తీవ్రాతి తీవ్రమైన ధ్యాన సాధన చేయాలి. ఎంత తీవ్రంగా మీరు ధ్యానం చేస్తే మీ మనసు యొక్క ప్రాముఖ్యం అంత తగ్గుతుంది, సంకల్ప శక్తి పెరుగుతుంది.

మీ శరీరం లోపల సూర్యుడి అంత శక్తి ఉంది, బయట మిణుగురు పురుగు లాంటి కాంతి ఉంది.  సూర్యకాంతి ముందు మిణుపురుగుల కాంతి చాలా అల్పం. కానీ మీరు అల్పమైన వాటి వెనకాల పరుగెట్టి అధికమైన వాటిని చేజార్చుకుంటున్నారు.

కానీ ఇవన్నీ ఇంత వివరంగా  తెలుసుకున్న రోజున మీ జీవితంలో శరీరంలో  ఆత్మకు ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి, ప్రపంచానికి ఎంత ప్రాధాన్యత ఇవ్వాలి అన్నది తెలుస్తుంది.

# జ్ఞానం పొందాలంటే?

నేను చాలా క్లాసుల్లో చెప్పాను మీకు భగవంతుడు ఇష్ట మవ్వడం కాదు.. భగవంతుడికి మీరు ఇష్టులు అవ్వాలి అని. అలా ఇష్టమైతేనే మీరు ధ్యానంలో స్థిరపడగలరు, జ్ఞానం పెంచుకోగలరు.

చాలా మంది మాకు ధ్యానం తెలుసు, చేయాలని ఉంది కానీ వీలవ్వట్లేదు అని కొంతమంది, ధ్యానం వల్ల మాకేమి లాభం కనిపించలేదు అని కొంతమంది, మాకు కలిసి రావట్లేదు అని కొంతమంది, అనుకున్నవి అవ్వలేదు అని కొంతమంది ధ్యానాన్ని వదిలేస్తారు. దాని అర్థం ఏమిటంటే భగవంతుడి కృప వీడి మీద లేదు కాబట్టే.

చూడండి పాండవులు ఐదుగురు ఉన్నా అర్జునుడికే ఆత్మజ్ఞానాన్ని కృష్ణుడు బోధించాడు అంటే అర్జునుడిని నాకు ఇష్టుడివి, సఖుడవి అన్నాడు.

భగవంతుడ్ని పొందాలి అంటే జ్ఞానం పొందాలి. కానీ జ్ఞాన మార్గంలోకి రావడానికి పుణ్యకర్మలు, సత్కర్మలు, యజ్ఞ కర్మలు చెయ్యాలి. ఎవరైనా ముందు పుణ్యకర్మలు చేస్తారు, ఇంకా సత్వగుణం పెరిగినప్పుడు నేను కాదు చేస్తున్నది భగవంతుడే నా చేత చేయిస్తున్నాడు అనే భావం వస్తుంది.

ఈ సత్వగుణంలో కూడా నిష్ణాతులైనప్పుడు యజ్ఞకర్మలు చేస్తారు. యజ్ఞకర్మలు అంటే అందరూ బాగుండాలి అని చేసే పనులు.

ధ్యాన మార్గంలోకి వచ్చిన వాళ్ళు జ్ఞానం పెంచుకోవాలనే చూస్తారు. కారణం పరమాత్మను చేరే మార్గం జ్ఞానమే కాబట్టి.

ఎందుకు అంటే శక్తివంతమైన మీరు ఏ నిర్ణయం తీసుకున్నా అది ఆచరణలో పెట్టగలరు. బలహీనమైన మనసు నిర్ణయం తీసుకున్నా నా వల్ల కాదులే అని ఆచరణలో పెట్టలేరు. కానీ మనసు శుద్ధి చేసుకున్నప్పుడు, ఆత్మ శక్తి పెరిగి గొప్ప కార్యాలు చేయగలుగుతారు

అందుకే మీరు రోజు ధ్యానం చేసి, జూమ్ కార్యక్రమంలో ఎన్నో క్లాసులు వింటున్నారు, జ్ఞానాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

ఎందుకు జ్ఞానం పెంచుకోవాలి? అంటే పరమాత్మని చేరుకోవాలి కాబట్టి. అలా చేరుకోవాలి అంటే మీరు ఏది అలవాటు చేసుకోవాలి, ఏది వదులుకోవాలి తెలుసుకోవాలి. గురువు వచ్చేవరకు మీలో లోపాలు మీకు అర్థం కావు. గురువు

వచ్చేవరకు మీరు సత్యం కానివన్నీ సత్యం అనుకుంటూ అజ్ఞానంతో బ్రతుకుతారు. అలాంటి మిమ్మల్ని గురువు జ్ఞానవంతుడిని చేస్తాడు.

నువ్వు సత్యం కాని దాన్ని సత్యంగా ఆరాధిస్తే మీకు ఎప్పటికీ మోక్షం రాదు. మరి సత్యమైన దానిని ఆరాధిస్తే, సత్యమైన దానిని పట్టుకుంటే మోక్షం వస్తుంది. మీరు భగవంతుడ్ని బయట వెతకకుండా లోపల ఉన్నాడని తెలుసుకొని, అంతర్యామిగా ఉన్న ఆ ఆత్మని తెలుసుకోవాలి అంటే ధ్యానసాధన ఒక్కటే మార్గం.

అది తెలియనప్పుడు తప్పులు, పాపాలు చేసి ఉండొచ్చు. కానీ ఆ కర్మలన్నీ నీ జన్మలకి కారణం అవుతుంది.

అందుకే ఈ లోకంలో గొప్పవాడు ఎవరయ్యా అంటే జ్ఞానవంతుడే అని చెప్తారు. ఎన్ని సంపదలున్నా, పేరు, భోగ భాగ్యాలు, పదవులు ఇవన్నీ కూడా తాత్కాలికమే! కానీ జ్ఞానం ఉన్నవాడు సృష్టిలో అందరి కంటే గొప్పవాడు.

అయితే ఈ భక్తి, కర్మ, యోగం తప్పు అంటారా అని చాలా మందికి అనుమానం రావచ్చు. అందుకే భగవద్గీత అన్ని మార్గాలలోకి ఉత్తమమైన మార్గం జ్ఞానం అని చెప్తుంది. జ్ఞానం వల్ల మాత్రమే పరమాత్మను తెలుసుకోగలరు, మోక్షాన్ని పొందగలరు, ఇహలోకంలో శాంతి, పరలోకంలో ముక్తి పొందగలరు.

ప్రతి ఒక్కరికీ ఆనందం కావాలన్నా, ఆరోగ్యం కావాలన్నా, మరి ప్రాపంచికంగా గొప్ప గొప్ప పనులు చేయాలన్నా జ్ఞానం అనేది ఉండాలి.

జ్ఞానం ఉన్నప్పుడు నేను, నాది అని పట్టుకోకుండా ఇదంతా పరమాత్మదే, నేను చేసే మంచి పనుల వల్ల నాకు అనుభవించడానికి మాత్రమే హక్కు ఉంది అని నిరంతర ఎరుకతో జీవిస్తూ తాను సుఖపడుతూ అందరినీ సుఖపెట్టడానికి ప్రయత్నిస్తాడు.

జ్ఞానం పొందే కాంక్ష నీలో ఉన్నప్పుడు ప్రాపంచికంగా ఎన్ని పుణ్యకర్మలు, సత్కర్మలు, యోగకర్మలు చేసినా అవి నేను చేస్తున్నాను అనే భావనతో కాకుండా, నా వల్ల ఈ ప్రపంచంలో జరగడానికి పరమాత్మే కారణం, ఆయన నాకు అవకాశం ఇస్తున్నాడు అని నువ్వు అనుకుంటావు.

అలా అనుకోగలిగినప్పుడు భూమి మీద ఎన్ని చేసినా అవి నీకేమి అంటుకోకుండా చక్కని జ్ఞానం కలుగుతుంది, ఆత్మదర్శనం పొందుతావు.

గురువు నువ్వు ఆత్మవి అని చెపుతారు. నువ్వు ఆత్మవే, నీ చుట్టూ ప్రపంచం కూడా ఆత్మమయమే, అన్ని జీవులు ఆత్మలే, అలా ఆత్మ ఆత్మ ఆత్మ అని నువ్వు నిరంతర స్మరణతో ఉంటే నువ్వు ఆ ఆత్మానుభూతి పొందుతున్నట్టే.

ఎంతగా నువ్వు జ్ఞానం పెంచుకుంటావో అంతగా నీ విలువ భూమి మీద పెరుగుతూనే ఉంటుంది. ఇక్కడ విలువ పెంచుకుంటూ, శాంతిని పొందుతూ, పరలోకంలో పరమాత్మను చేరుకుంటూ ముక్తిని పొందుతావు.

చూడండి ఒక వెదురు కర్రకి పొడుగును బట్టి విలువ, చెరుకు గడకి రసాన్ని బట్టి విలువ, పాలకి వెన్నను బట్టి విలువ, అలాగే మనిషికి జ్ఞానాన్ని బట్టి విలువ.

చూడండి బజార్లో వెదురు కర్రలు పోడుగ్గా ఉన్నవి చూసి కొనుక్కుంటారట, రేటుకూడా ఎక్కువ పెడతారు.

అలాగే చెరుకు గడలో రసం ఎక్కువగా ఉంటే అది మంచి చెరుకు అని నిర్ణయిస్తారట.

అలాగే వెన్న ఉన్న పాలకి రేటు ఎక్కువ ఉంటుంది, విలువ ఎక్కువ ఉంటుంది.

అలాగే జ్ఞానం ఉన్న వ్యక్తికి భూమి మీద విలువ ఎక్కువ. మీరు అనుకుంటారు డబ్బులో విలువ ఉంది, పదవులకు విలువ ఉంది, డిగ్రీలకు, ఉద్యోగాలకు విలువ ఉంది అంటారు. పత్రి గారిని చూస్తే ప్రతి ఒక్కరు ఆటోమేటిక్ గా దండం పెట్టుకుంటారు, కారణం ఆయనకు ఉన్న జ్ఞానానికి.

ఈరోజు ఇన్ని లక్షల మందికి ఆదర్శ పురుషుడు అయ్యాడు అంటే పత్రి గారిలో ఉన్న జ్ఞానమే. ఎన్ని సొసైటీలలో ఉన్నవారైనా అంటారు, మీ గురువుగారు "శ్వాస మీద ధ్యాస" పెట్టించి ధ్యానం చేయిస్తారు, దానివల్ల వచ్చే లాభాలు మీకు బోధిస్తూ, మిమ్మల్ని జ్ఞానవంతుల్ని చేశారు అని చెప్పడం జరిగింది.

అలాంటి గొప్ప ధ్యానం వల్లనే మీరు జ్ఞానం పొందగలిగారు. లేకపోతే ప్రాపంచిక విషయాల్లో జీవితాన్ని అస్తవ్యస్తం చేసుకునేవాళ్ళు. నువ్వు ఆత్మవని తెలుసుకోవడానికే ధ్యానం చేయాలి అని ఆయన స్పష్టంగా చెప్పారు,. ఆయన ఇంకా ఈ ఆత్మ ఎన్ని రకాలుగా భూమి మీద జన్మలు తీసుకుందో తెలుసుకోవాలి. ఈ ఆత్మ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకోవాలి, మళ్ళా ఎక్కడికి వెళ్ళాలో తెలుసుకోవాలి. ఇన్ని తెలుసుకోవాలంటే నీకు జ్ఞానం ఉండాలి అన్నారు పత్రి గారు.

ఆయన ఇంకా ప్రపంచంలో అన్నిటి మీద ధ్యాస తగ్గించి "శ్వాస మీద ధ్యాస" పెడితే అద్భుతంగా ఎదుగుతూ జ్ఞానవంతుడు అవుతావు అన్నారు.

గమనిస్తే సృష్టిలో ఎన్ని ఉన్నాయో అన్ని మీలో ఉన్నాయి. కానీ "శ్వాస మీద ధ్యాస" పెట్టక ఏమి తెలియని వాళ్ళలా, ఏ శక్తులు లేని వాళ్ళలా ఉన్నారు.

కానీ అనంతమైన శక్తి ఆత్మలోనే ఉంది, దాన్ని వెలికి తీసే మార్గమే ధ్యానం. నిన్ను భూమి మీద ఉండగానే దైవంగా చేసేది ఆ ధ్యానం ఒక్కటే.

ఆ ధ్యానం చేస్తూ మరి నీకు నువ్వుగా నీ మేధస్సును పెంచుకుంటూ మరి ఆ జ్ఞానం పెంచుకోవాలి. నువ్వు పూర్ణమైన జ్ఞానవంతుడవు అన్నది అనుభవంలోకి తెచ్చుకుంటూ ఆచరణలో పెట్టుకున్నప్పుడే నీకు పరమాత్మ దర్శనం కలుగుతుంది అని చెప్పారు.

మనసు ప్రపంచం సత్యం అంటుంది, సత్యం కానిది సత్యం అంటుంది కాబట్టి ధ్యానం చేస్తూ మనసు ప్రభావాన్ని తగ్గిస్తూ ఆ మనసును ఆత్మ వైపు తిప్పి ఆత్మలో లయం చేసినప్పుడు దైవంగా ఎదుగుతావు.

అప్పుడే నీకు అజ్ఞానం తొలగి జ్ఞానం పెరిగి, నేనేకాదు అందరూ భగవత్ స్వరూపాలే అని నీకు ఆచరణలోకి వచ్చినప్పుడు.. పరమాత్మ దర్శనం కలుగుతుంది.

ఒక్క మాటలో చెప్పాలి అంటే? జ్ఞానం ఎందుకు అంటే 'జీవుడే దేవుడు' అని తెలుసుకోవడానికి. మనసు నేను జీవుడను అని అనుకుంటుంది, నేను దేవుణ్ణి అంటుంది ఆత్మ. మీరు ఆత్మ స్వరూపులు కాబట్టి, దైవాలుగా ఉండాలి కాబట్టి, అడ్డుగా ఉన్న మనసును తొలగించుకోవడానికి ఉన్న ఒకే ఒక్క మార్గం ధ్యానం.

అది తొలగాలి అంటే మెల్లిమెల్లిగా ఈ పరమాత్మ యొక్క జ్ఞానాన్ని మనసుకి అందించాలి. అలా అందిస్తే ఓహో నేను ప్రపంచం వైపు తిరిగి తప్పు చేస్తున్నాను, భ్రాంతిలో ఉన్నాను, భ్రమలో ఉన్నాను. నేను ఈ భ్రమని వీడితే బ్రహ్మమే అవుతాను అనే ఆలోచన రావాలి. ఎందుకు అంటే ప్రపంచం శాశ్వతం అనే భ్రమ, నేను శరీరం అనే భ్రమ, ఈ బంధువులంతా నాకూడా వస్తారన్న భ్రమ, ఇవన్నీ శాశ్వతం అనుకోవడమే మనసుకున్న భ్రమలు.

ఈ భ్రమలు అన్ని వీడితే బ్రహ్మమే అవుతావు అంటారు. అవి వదలడానికే ఈ సాధన. ఈ సాధన చేస్తేనే జ్ఞానం పొందుతావు.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) మరణించకముందే మరణించాలి - రూ.130/-
10) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
12) గీతాసందేశం - రూ.120/-
13) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/-
23) కర్మ సిద్ధాంతం - రూ.80/-
24) ధ్యానమంటే ? - రూ.80/-
25) త్రివిధాలు - రూ.80/-
26) ఉత్తమ పురుషుడు - రూ.80/-
27) శాస్త్రాల అర్థం-అంతరార్థం - రూ.70/-
28) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
29) జ్ఞాన జ్యోతి - రూ.70/-
30) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
31) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
32) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
34) బుద్ధుని సందేశాలు - రూ.70/-
35) భూతదయే దైవత్వం - రూ.70/-
36) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
38) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
39) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
40) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
41) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
42) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
43) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
44) అతీంద్రియ శక్తులు - రూ.60/-
45) ఆలోచించండి - రూ.60/-
46) నిర్వాణ మార్గం - రూ.60/-
47) ధ్యానులకు సూచనలు - రూ.60/-
48) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
49) సంకల్పమంటే? - రూ.50/-
50) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
51) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
53) మూడురకాల భవిష్యత్తులు -రూ.50/-
54) మూడురకాల జీవితాలు -రూ.40/-
55) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
56) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
57) బ్రహ్మం అంటే? -రూ.40/-
58) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం-రూ.40/-
59) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
60) మహాత్ముల సందేశాలు - రూ.40/-
61) సత్యం - రూ.40/-
62) చక్రాలు - రూ.40/-
63) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
64) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
65) మౌన ధ్యానం - రూ.40/-
66) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
67) శాకాహారమే మానవాహారం - రూ.15/-
68) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



## ఆత్మజ్ఞానము పొందలేకపోవడానికి కారణాలు

**1) మానసికమైన జడత్వము :** ప్రపంచం వైపు తిరిగి ఉన్న మనసు పరమాత్మ గురించి తెలుసుకోవడానికి ముందు ఇష్టపడదు. వారికి ధ్యానం అన్నా, ఆత్మవిద్య, బ్రహ్మ విద్య అన్నా ఆసక్తి చూపించరు. దీన్నే మానసికమైన జడత్వము అన్నారు.

**2) సంశయ చిత్తం :** ఉన్నాడో, లేదో తెలియని భగవంతుని గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఏముంది? ధనం సంపాదించుకుంటే దర్జాగా బ్రతకవచ్చు కదా! అనుకుంటారు. ఇదే ఆ మనసుకున్న సంశయం.

**3) అసంతృప్తి :** ప్రాపంచిక జీవితంలో తృప్తిగా జీవించకపోవడం. ఇప్పుడు ప్రతి వాళ్ళు అసంతృప్తితోటే జీవిస్తున్నారు. ఎన్ని ఉన్నా ఇంకా సరిపోదు అనుకుంటూ ఆయుష్షు తరిగిపోతున్నా, ఇంద్రియాలు పని చేయని స్థితికి చేరుకున్నా ఇంకా ఏదో సంపాదించాలని ప్రయత్నిస్తున్నారు.

**4) మనసు అశాంతిలో ఉండడం :** మానసికమైన అలజడుల వల్ల బ్రహ్మజ్ఞానం పొందడానికి ఇష్టపడరు. ఏవైనా కష్టాలు కానీ, పనుల్లో ఆటంకాలు కానీ వస్తే మాకు ధ్యానం అచ్చి రాలేదు అని ధ్యానం వదిలేస్తారు.

**5) విద్యాకాంక్ష లేకపోవడం :** మామూలు ప్రాపంచిక విద్యలు చదవలేదు కదా? మరి ఆధ్యాత్మిక విద్య ఎలా వస్తుందని అనుకోవడం.

సద్గురువు చెప్పిన సాధన చేసి ధ్యానం మీద తీవ్రాతి తీవ్రమైన కాంక్ష పెంచుకుంటే బ్రహ్మ విద్య పొందవచ్చు.

**- బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి**

**Rs.60/-**